ముగాఁ గలది యీమె. రాజీమెను ముద్దుపెట్టుకొనఁ బోవునపుడు "పౌరవ! సౌశీల్యమును కాపాడుము. మన్మథ పీడితురాలనైనను నేను స్వతంత్రురాలను గాను" అనెడివాక్యమున హైందవస్త్రీకిఁగల యుత్తమ లక్షణము గానవగును. భర్త తన్ను తిరస్కరింపఁగా, కొంత కోపము తోడ, దుఃఖాశ్రువులనింపుచు వెడలిపోయినను శకుంతల యాతనిపైఁ గల ప్రేమానురాగములఁ గాని, యాతనియెడఁ దా నాచరింపవలసిన ధర్మములను గాని మఱవనేలేదు. తాను యోగినివలె చరింపఁ దొడఁగెను. తల ముడువదు; మంచిచీర కట్టదు; ఆహారము స్వీక రింపదు, అంతే. నిరంతరము తనభర్త విగ్రహమును దన హృదయ మునఁ బదిలపఱచికొని తదేక ధ్యానమగ్నయై శకుంతల తన విరహ కాలమును గడపినది. తా నత్తవారింటికి నరుగు సందర్భమునఁ దండ్రి కాశ్యపు లొసఁగిన యుపదేశమును శిరసావహించినది.[2]

ఈమెకుఁ దన చెలికత్తెలగు అనసూయా ప్రియంవదల పయిని గల చెల్మి యనురాగము లపారములు.

అనసూయా ప్రియంవదలు :

వీరలు శకుంతల చెలికత్తెలు. ఆమెవలెనే వీరికుఁబురను గూడ కణ్వుఁడు పెంచిపెద్దచేసెను. వీరు కావ్యేతిహాసములను పఠించినవారు. అనసూయా ప్రియంవదలలో అనసూయ పెద్దది అగుటచే నెక్కువ యాలోచనా సామర్థ్యములు కలదిగాఁ దోఁచును. ప్రియంవద సార్థక నామధేయ. దుష్యంతునకు జాబు వ్రాయుటయందు, దుష్యంతు నితో సంభాషించుటయందు, దూర్వాసుని శాంతింపఁ జేయుటయందు ననసూయ చూపిన నేర్పు ప్రశంసనీయము. ప్రియంవద చతురోక్తుల యందు నిపుణ.

1. చూ. "మిగుల మాసిన వస్త్రంబు మేనఁ దాల్చి...." పుట. 123.

2. "వరుఁ దలఁకన్వహించినను భర్త్రు విరుద్ధవు గాకుము" ఇత్యాది. పుట. 68.

కణ్వుఁడు :

ఇతఁడు శకుంతలాప్రియంవదానసూయలకుఁ బెంపుడుఁ దండ్రి. నాల్గవయంక మితనిమహత్త్వమునకు, కూఁతురగు శకుంతలయెడఁ గల వాత్సల్యాతిరేకమునకు నిదర్శనములు. తాను మహర్షియైనను శకుంతలా నిర్గమన సమయమున కన్నీరు కార్చెను. వనవాసియైనను నితఁడు లోకవ్యవహార జ్ఞానము నధికముగాఁ గలవాఁడు. నాల్గవ యంకమున శకుంతలకు చేసిన బోధనలు, రాజునకుఁ జెప్పిన హితవాక్యములు మఱువ దగినవి కావు.

ఇందలి సూక్తులు కొన్ని *

1. ఎంతయుఁ బ్రవీణులనువారి హృదయమైన జాల నమ్మకమిడ దాత్మశక్తి యందు. 2
2. భాగ్యంబు లమరనున్న కాలమందు సర్వత్రమార్గములు కలుగు. 9
3. ఉద్యానలతలు వనలతలె మించవే గుణగణముచేత. 10
4. తలఁపగ సుందరాంగులకుఁ దాను విభూషణ మేది కాదు ? 11
5. ఎందు సందేహవస్తువులయందు నాత్మగతులె ప్రమాణంబు లార్యులకును. 14
6. చటుల ప్రభాతరళమగు తటిల్లత జనియింపఁగలదె ధారుణి నెందుఁ. 19
7. కాముకుండు సర్వ మాత్మవిషయంబుగనే కొనుచుండు నాత్మలోఁ. 26
8. దుఃఖమును చెలులు పంచుకొన్నప్పుడుగదా వేదన సహ్యముగా నుండును ? 44
9. కాముకుల కెప్పుడును వివేక ముండదుగదా. 45

---

* ఇందు తుదిసంఖ్య పుటసంఖ్యలను దెలుపును.

నాటక లక్షణము *

శ్రవ్యకావ్యములని, దృశ్యకావ్యములని కావ్యములు రెండు తెఱంగులు. అందు చూడఁదగినవి దృశ్యంబులు.

వీనికి రూపకములనియు పేరు. దుష్యంతాదుల సుఖదుఃఖాదులగు అవస్థ లారోపించుటవలన నివి రూపకము లనఁబడును. రూపకము పదివిధములు.

1 నాటకము 2 ప్రకరణము 3 భాణము 4 ప్రహసనము 5 డిమము 6 వ్యాయోగము 7 సమవాకారము 8 వీథి 9 అంకము 10 ఈహామృగము.

పై రూపక భేదములకు హేతువులగు వీనిలో ఇతివృత్తములు ముత్తెఱంగులు.

1 ప్రఖ్యాతము 2 ఉత్పాద్యము 3 మిశ్రము.

ప్రఖ్యాతము—ఇతిహాస ప్రసిద్ధమగు కథ ప్రఖ్యాతము.

ఉత్పాద్యము—కవికల్పితగాథ యుత్పాద్యము.

మిశ్రము—ప్రఖ్యాతము కొంత, ఉత్పాద్యము కొంత కలిసినచో మిశ్రము.

నాటకము, ముఖము, ప్రతిముఖము మొదలగు పంచసంధులతోడ నితర రూపకముల కన్నింటికిని ముఖ్యమై, వీర శృంగార రసంబులలో నేదేని యొక్కటి ప్రధానముగాఁ గలిగి ప్రసిద్ధ (ధీరోదాత్త) నాయకునితో నొప్పియుండును. దీనికి ఇతివృత్తము ప్రసిద్ధము.

ఇట్టి నాటకమున అయిదు మొదలు పదియంకము లుండవచ్చును.

* శ్రీమాన్ వంగీపురము కృష్ణమాచార్య రచిత "కావ్యలక్షణ సంగ్రహము" నుండి యీ భాగము గృహీతము.

ప్రత్యంకమునను ఒక దినమునం దాడఁదగిన ఒక ప్రయోజనమును వర్ణింపవలెను. నాందీప్రస్తావనాదు లవశ్యముగా నుండవలయును.

పంచసంధులు

ధర్మార్థ కామఫల ప్రయోజనములతోఁ గూడిన కథా విషయములకు వేఱొక ప్రయోజనముతోడి సంబంధము సంధి.

(1) ముఖసంధి. (2) ప్రతిముఖసంధి. (3) గర్భసంధి. (4) అవమర్శసంధి. (5) నిర్వాహణసంధి – అని యిది పంచవిధములు.

1. ముఖసంధి—అనేకవిధములైన ప్రయోజనములకును రసములకును కారణమైన బీజము కల్పించుటయే ముఖసంధి.

బీజము— మొదట చిన్నదిగానుండియుఁ గ్రమక్రమముగా అనేక ప్రకారముల వ్యాపించి త్రివర్గఫలసాధక కావ్యమునకు హేతువైన విషయము బీజము.

2. ప్రతిముఖసంధి—విషయమున గనఁబడి, వేఱు విషయమునఁ గనఁబడక ఉన్నబీజము ప్రకాశించుట (అనఁగా బిందువు, ప్రయత్నము—వీని చేరిక) ప్రతిముఖసంధి.

బిందువు—ఒక కథాంశము ముగియనుండగాఁ గథ విడిపోకుండునట్లుగా తర్వాతికార్యము కూర్చుటకుఁ గారణమైనది బిందువు.

3. గర్భసంధి—ముఖసంధిలోఁ గల్పింపఁబడిన బీజము ప్రతిముఖసంధిలోఁ గనఁబడి కనఁబడక యుండఁగా దానిని వెదకుటయే గర్భసంధి. (బీజమునకు మొదట అడ్డు, తర్వాతప్రాప్తి, మరల నపాయము, పిదప ఉపాయము అను హేతువులచేత స్థిరీకరింపఁబడిన ఫలప్రాప్తి కలిగియుండుట: అని భావము)

4. అవమర్శసంధి—కోపము, వ్యసనము మొదలగువానిచే గర్భసంధియందు వెల్గిన బీజము విషయముగాఁ జేయఁబడు పర్యాలోచన

మవమర్శసంధి. (అనగా నపాయరహిత ఫలప్రాప్తికి నిశ్చయాలోచన నము అని భావము.)

౫. నిర్వహణసంధి—ముఖాది సంధులకు ప్రధానఫల ప్రయోజ నైక్యము నిర్వహణసంధి.

నాంది

శబ్ద సామ్యములవల్లఁ గాని, అర్థవిశేషములవల్లఁ గాని, రూపకమునందుఁ బ్రవర్తింపఁబడనున్న విషయమును గొంచెముగా సూచించుచు ఎనిమిదిగాని, పంౘ్రెండుగాని, పదునెనిమిదిగాని, ఇరువది రెండుగాని పదములతో విరాజిల్లు ఆశీర్నమస్క్రియా రూపమగు పద్యము నాంది.

నాటకప్రారంభమున విఘ్నశాంతికై ఇది చేయఁబడును. ఈ కార్యమునకుఁ బూర్వరంగ మని పేరు.

కవులు, నటులు, సభ్యులు దీనికే ఆనందము నొందుదురు. గావున దీనికి నాంది యని పేరు. నాటకమునకు సూత్రధారు లిద్దఱు. వీరిలో మొదటివాఁడు నాంది చదువును. రెండవవాఁడు ప్రస్తావన జరుపును. నాందిలోని పదశబ్దమునకు – పదమని కొందఱు, పద్య పాదమని కొందఱు, వాక్యములని కొందఱు నభిప్రాయ పడుచున్నారు. కొందఱిమతమున పదనియమ మక్కఱలేదు.

ప్రస్తావన (ఆముఖము)

సూత్రధారుఁడు (రెండవవాఁడు) తాను జరుపనున్న కార్యమును గుఱించి వాక్చాతుర్యముతో నటీ, మారిష, విదూషకులలో నేయొక్కరితో నైన చేయు సంభాషణ ఆముఖమనియు, ప్రస్తావన అనియు ననఁబడును.

దీనికి అంగములు మూఁడు.

(1) కథోద్ఘాతము (2) ప్రవర్తకము (3) ప్రయోగాతిశయము.

ప్రకృతకథకు పోలినట్లుగా సూత్రధారుఁడు ప్రయోగించిన వాక్యార్థమునే చేకొని పాత్రము రంగమున ప్రవేశించుట కథోద్ఘాతము.

సూత్రధారుఁడు చేయు ఋతువర్ణనముచే సూచింపఁబడి పద సామ్యమును బట్టిగాని, ఆ ఋతుసమానమైన ధర్మములు గలిగివట్టిగాని పాత్రము ప్రవేశించుట ప్రవర్తకము.

సూత్రధారుఁడు స్థిరపఱచి 'ఇదిగో' 'ఇతఁడు' అని చెప్పి చూపినంతనే తదనుగుణముగ పాత్రము ప్రవేశించుట ప్రయోగాతిశయము. ప్రస్తావనలో ఋతుగానము కవి వంశ సామర్థ్యాదికములు గూడ వచింపఁబడును.

విష్కంభము.

రంగమునఁ బ్రదర్శింప వీలుపడని విషయమును సూచించుచు జరిగినదియు, జరుగనున్నట్టియు నగు కథను మధ్యమ పాత్రలచే తెలుపుట విష్కంభము. ఇది శుద్ధము, సంకీర్ణ(మిశ్ర)ము నని రెండువిధములు.

శుద్ధవిష్కంభము—ఒకరుగాని, ఇద్దరుగాని మధ్యమ పాత్రలచే సూచింపఁబడినది.

మిశ్ర (సంకీర్ణ) విష్కంభము — మధ్యమాధమ పాత్రలచే సూచింపఁబడినది.

ప్ర వే శ క ము

ప్రదర్శింపఁ వీలుగాని విషయమును సూచించుచు జరిగినది, జరుగనున్నది యగు కథను కేవలము నీచపాత్రలచేఁ బ్రయోగించిన ప్రవేశకము. ఇది ప్రథమాంకము ముందుండరాదు. నాయకుఁడు, ప్రతినాయకుఁడు, మంత్రి, పురోహితుఁడు, విద్యాధికులు, నాయిక - ఉత్తమ పాత్రములు.

విదూషకుఁడు, దూతి, దాసదాసీజనులు మధ్యమపాత్రములు. సేవకులు, తోటమాలి, చండాలాదులు నీచపాత్రములు.

చూ ళి క

తెరలోపలనుండు పాత్రముచే సూచింపఁబడిన విషయము చూళిక.

అం కా స్య ము

ముందటి అంకముచివరనున్న పాత్రచే తర్వాత యంకప్రారంభ విషయము సూచింపఁబడిన నది అంకాస్యము.

అం కా వ తా ర ము

విష్కంభముతోఁ గాని, ప్రవేశకముతోఁ గాని, అక్కడ లేకయే ముందంకము చివరఁ బ్రవేశించిన ఒకపాత్రచే, మునుపటి యంకము యొక్క కథ విడిపోకుండునట్లుగాఁ దరువాతి యంక కథ సూచింపఁ బడుట అంకావతారము.

ర స ము – ర స స్వ రూ ప ము

విభావ, అనుభావ, సాత్త్విక, వ్యభిచారి భావముల సమ్మేళన మున నాస్వాదింపఁబడు స్థాయిభావమే రసము.

సరస కావ్యబంధమున, నిపుణ నట ప్రదర్శన సామాజికుల (ప్రేక్షకుల) చే భావింపఁబడి విభావాదుల కూడికచే పరిపుష్టమై ఆసాద్యింపఁబడు స్థాయిభావమే రసమని తాత్పర్యము.

స్థా యి భా వ ము

సజాతీయములగు భావములచేఁ గాని, విజాతీయములగు భావము లచేఁ గాని, తెంపులేక అనుభవించువఱకును స్థిరముగానుండు మనో ధర్మరూపమగు భావము స్థాయిభావము.

ర స వి భా గ ము

1 శృంగారము 2 హాసము 3 కరుణము 4 రౌద్రము 5 వీరము 6 భయానకము 7 భీభత్సము 8 అద్భుతము 9 శాంతము *

వీనికిఁ గ్రమంబుగ స్థాయిభావములు :

1. శృంగారమునకు–రతి, 2. హాస్యమునకు – హాసము, 3. కరుణమునకు–శోకము, 4. రౌద్రమునకు–కోపము, 5. వీరమునకు–ఉత్సాహము, 6. భయానకమునకు–భయము, 7. భీభత్సమునకు–జుగుప్స, 8 అద్భుతమునకు–విస్మయము, 9. శాంతమునకు–శమము.

రసోత్పత్తికిఁ గారణమైనది విభావము.

రతి, హాసము మొదలగు నాయా స్థాయిభావముల విశేషముగా భావింపఁజేయునది విభావము.

అట్టి విభావము ఆలంబనవిభావ మని, ఉద్దీపనవిభావమని రెండు విధములు.

1. ఆలంబన విభావము :—

రతి మొదలగు స్థాయిభావముల చేరికకు సంబంధ కారణమైనది ఆలంబనవిభావము.

---

* శాంతరసమును త్రోసిపుచ్చి ఎనిమిదియే రసములని ధని కాదుల మతము. శృంగారమొక్కటే రసమని శృంగారరసప్రకాశకర్త. ప్రేయస్సు, శాంతములతోఁ బదియని రుద్రటుఁడు. వీనితో వాత్సల్యము, భక్తి కూర్చి పండ్రెండని మఱికొందఱు. పైతొమ్మిదే ప్రధానరసములని భరతాదులు. ఈనవరసములును ధర్మార్థకామమోక్ష ఫలముల నొసంగ వలంతులని యర్థము.

ఉదా:-నాయికానాయకులు - రతియను స్థాయిభావము నేర్పడు ప్రతివిశేషము లకు స్థానమైనవారు నాయికానాయకులు కావున వీరిని ఆలంబన విభావమందురు.

2. ఉద్దీపన విభావము :—

రత్యాది స్థాయిభావముల కాలంబనమైన నాయికానాయకాదుల గుణములు, చేష్టలు, అలంకారములు, తటస్థములగు మలయానిల చంద్ర కిరణాదులు ఉద్దీపనవిభావము.

నాయికానాయకాదుల రూపము, యౌవనము మొదలగునవి గుణములు – హావము, భావము మొదలగునవి చేష్టలు–వస్త్రములు, నగలు మొదలగునవి అలంకారములు–చంద్రుఁడు, ఉద్యానము, మలయమారుతము మొదలగునవి తటస్థములు.

సూక్ష్మముగనున్న రత్యాదిస్థాయిభావముల ఉద్దీపింపజేయుట (ప్రేరేఁచుట)చేత ఇది ఉద్దీపన విభావము.

అనుభావము

లౌకికములైన రత్యాదిస్థాయుల కార్యములైన క్రీఁగంటి చూపులు మొదలగునవి అనుభావములు. రత్యాదిభావముల అనుభవింపఁ జేయుటవలన వానికిఁ దరువాత నుద్భవించుటచే ఇది అనుభావము.

సాత్త్వికము

పరుల కష్టసుఖములను బలుమాఱులు భావించుటవలన మనంబు నకుఁ గల్గు తన్మయత్వము సత్త్వము. అట్టి సత్త్వమువల్ల గలుగునవి సాత్త్విక భావములు.

ఇవి యెనిమిది విధములు :

1. స్తంభము, 2. ప్రళయము, 3. రోమాంచము, 4. స్వేదము, 5. వైవర్ణ్యము, 6. వేపధువు, 7. వైస్వర్యము, 8. అశ్రువు,—అని.

వ్య భి చా రి భా వ ము

(సంచారిభావము)

సర్వత్ర విశేషముగ రత్యాదిస్థాయిభావములకు సహాయకారు లగుచు చరించునది. వ్యభిచారిభావము అను నీపదము వ్యుత్పత్తియు నిదియే. ఇది ముప్పదిమూఁడు విధముల నుండును.

నిర్వేదము, గ్లాని, శంక, అసూయ, మదము, శ్రమము, ఆలశ్యము, దైన్యము, చింత, మోహము, స్మృతి, ధృతి, వ్రీడ, చాపలము, హర్షము, ఆవేగము, జడత, గర్వము, విషాదము, ఔత్సుక్యము, నిద్ర, అపస్మారము, సుప్తి, బోధము, అమర్షము, అవహిత్థ. ఉగ్రత, మతి, వ్యాధి, ఉన్మాదము, మరణము, త్రాసము. వితర్కము.

ఇవి రసమునకు సహాయ కారకములు.

సముద్రమున అలలు పైకెగయుచు తగ్గుచు ఆసముద్రమునకు ఉత్కర్ష గలిగించుచు తాము నా సముద్రరూపమునే పొందునట్లు ఈవ్యభిచారి భావములు స్థాయిభావములందే పుట్టుచుఁ దగ్గుచు స్థాయి పోషణమునకై తామును తద్రూపమునే పొందును. రసములకు సహకారులనుట యీకార్యమే.

నా య క ల క్ష ణ ము

దోషరహిత కావ్యములందు రసమున కాటపట్టగు నాయకుఁడు ప్రధానము. పుణ్యశ్లోకుఁడగు నాయకుని చరిత్రము వర్ణింపఁ బడని కావ్యము వర్జింపఁదగినదని ప్రాజ్ఞులవచనము. ఉదాత్తనాయక చరిత్రమే ప్రబంధముకొక్క ప్రశస్తికిఁ గారణమని పెద్ద లనుచున్నారు.

ఇట్టి నాయకుఁడు, కులీనత, ఉజ్జ్వలత, భాగ్యము, ఔదార్యము, తేజస్విత, వైదగ్ధ్యము, ధార్మికత్వము మొదలగు గుణములచేత విరాజిల్లును. ఈనాయకుఁడు ప్రబంధఫలభోక్తయగును. ఇవిగాక యితఁడు యశము, ప్రతాపము, చతుర్విధ పురుషార్థములయం దనురక్తి, సద్గుణములు గలిగి యుండును.

ధీరోదాత్తుఁడు, ధీరోద్ధతుఁడు, ధీరశాంతుఁడు, ధీరలలితుఁడు అని నలుదెఱంగుల నాయకులు శృంగారాది రసంబుల కాటపట్టయి వఱలుచుందురు.

1. ధీరోదాత్తుఁడు—ధీరుఁడు, గంభీరుఁడు, మహాసత్వ సంపన్నుఁడు, కరుణామయుఁడు, ఉదారుఁడు, నిరహంకారుఁడు, ఆత్మస్తుతి దూరుఁడు నయిన నాయకుఁడు ధీరోదాత్తుఁడు.

ఉదా : రాముఁడు, దుష్యంతుఁడు, హరిశ్చంద్రుఁడు, జీమూతవాహనుఁడు మొదలగువారు.

2. ధీరోద్ధతుఁడు— ఎక్కువ బలము గలవాఁడు, భయము గొల్పు నడవడిక గలవాఁడు, ఆత్మస్తుతిప్రియుఁడు, అతికోపనుఁడు, అత్యహంకారి అగు నతఁడు ధీరోద్ధతుఁడు.

హిరణ్యకశిపుఁడు, రావణుఁడు, శిశుపాలుఁడు, దుర్యోధనుఁడు మున్నగువారు. వీరెప్పుడును ప్రతినాయకులుగనే పరిగణింపఁ బడుదురు.

3. ధీరలలితుఁడు—నిశ్చింతుఁడు, కళలయం దనురక్తుఁడు, స్మరభీతుఁడు, భోగాసక్తుఁడు నగు నాయకుఁడు ధీరలలితుఁడు.

శూద్రక మహారాజు మొదలగువారు.

4. ధీరశాంతుఁడు—ధీరుఁడు, శాంతుఁడు, ద్విజుఁడు, శుచి, ధీశాలి, అభిమాని, సుకుమారుఁడు అగు నాయకుఁడు ధీరశాంతుఁడు.

చారుదత్తుఁడు మొదలగువారు.

పై నలువురుగాక (1) అనుకూలుఁడు, (2) దక్షిణుఁడు, (3) ధృష్టుఁడు, (4) శఠుఁడు నని శృంగారనాయకులు నల్వురు గలరు.

నా య క స హా యు లు

శృంగార నాయకులకు నాయికల ననుకూలింపఁ జేయుటకు సహాయులు నల్గురు సచివులుగలరు. వారు– (1) పీఠమర్దుఁడు. (2) విటుఁడు (3) చేటుఁడు (4) విదూషకుఁడు.

1. పీఠమర్దుఁడు—నాయకునికంటెఁ గొంచెము తక్కువవాఁడై సకల కార్యములను జేయువాఁడు పీఠమర్దుఁడు.

రామాయణమున సుగ్రీవాదులు.

2. విటుఁడు—పీఠమర్దునికంటె తక్కువ వాఁడును, నాయకున కుపయోగించు సంగీతాది విద్యలలో నెదోయొక్కవిద్య నెఱింగినవాఁడు విటుఁడు.

నాగానందమున శేఖరకుఁడు మున్నగువారు.

3. చేటుఁడు—నాయికాసంధాన కుశలుఁడై, మాటలందు నేర్పరియై నాయకునకు సహాయుఁడైనవాఁడు చేటుఁడు.

4. విదూషకుఁడు—మాటల వికారత చేతను, అంగవికారాదుల

చేతను నవ్వించుచు నాయకుని మనస్సును సంతోషపెట్టువాఁడు విదూషకుఁడు.

శాకుంతలమున మాధవ్యుఁడు—మొదలగువారు.

నా యి క లు

నాయికలు : (1) స్వీయ (2) పరకీయ (3) సామాన్య అను మూఁడు భేదముల నొప్పుచుండును.

1. స్వీయ—కులవతి, లజ్జావతి, సౌశీల్యాది సకలసద్గుణవతి అగు నాయిక స్వీయనాఁబడు.

సీత. రుక్మిణి మున్నగువారు.

2. పరకీయ—పరపురుషుని యందున్న ఆసక్తిని మఱుఁగు పఱచునది పరకీయ.

3. సామాన్య—సంగీతాభినయాది లలితకళ నెఱింగి ఉత్సాహవతియై వెలంగుచుఁ గపటవిలాసములు గలిగి తన యభిప్రాయము నెవ్వరికినిఁ దెలియపఱుపకుండు వెలయాలు సామాన్య.

స్వీయనాయిక : (1) ముగ్ధ, (2) మధ్య, (3) ప్రౌఢ యను భేదముల మూఁడు తెఱంగుల నుండును.

1. ముగ్ధ—అప్పుడప్పుడే పొడసూపు జవ్వనపుఁ బొల్పుతో లజ్జచేత శృంగారచేష్టల మఱుఁగుపఱచునది ముగ్ధ.

2. మధ్య — యౌవనోచిత కామసంపత్తిగలిగి, సమాన లజ్జయు వంగవికాసమును రతియందలి యుత్సాహముగల జవ్వని మధ్య.

3. ప్రౌఢ—ఎక్కువవలపు, సిగ్గుపలుచన, కామావేశబుద్ధి, మదనకార్యచాతుర్యము గల యువతి ప్రౌఢ.

ఈ నాటకమునకు నుపోద్ఘాతము వ్రాయుటకు నా కవకాశము కల్గించిన హితకారిణీ సమాజమువారికి, దీని నచ్చొత్తించుటలో ననేక విధములఁ దోడ్పడిన శ్రీ పామర్తి గోపాలకృష్ణ శర్మగారికి, ముద్రాపకులు శ్రీ అద్దేపల్లి నాగేశ్వరరావుగారికి మిక్కిలి కృతజ్ఞుఁడను.

ప్రభుత్వ కళాశాల
రాజమహేంద్రవరము
10—7—1952

గ. శ్రీ. న. ఆచార్య.
ప్రధానాంధ్రోపన్యాసకుఁడు.

అభిజ్ఞాన శాకుంతలము

అష్టమ ముద్రణము

శ్రీ కందుకూరి వీరేశలింగము పంతులుగారి యీ భాషాంతరీకరణము నేఁడు అష్టమ ముద్రణము నొందఁగల్గుటకు తోడ్పడిన యావదాంధ్రలోకమునఁ గల పండితులకు, పామరులకు, రసికులకు, ఆంధ్ర విశ్వకళా పరిషత్తునకు, శ్రీమాన్ క. శ్రీ. న. ఆచార్యగారికి మా కృతజ్ఞత మనస్ఫూర్తిగా ప్రకటించుచున్నాము.

హితకారిణీ సమాజము.

శ్రీ

అభిజ్ఞాన

శాకుంతలము

ప్రస్తావన

నాంది

ఉ. ఎయ్యది యాద్యమహా నజునిసృష్టికి, హవ్యము నేది తాల్చుఁ, దా
నెయ్యది సోమయాజి, మఱి యేయవి కాలవిభాగ మిచ్చు రెం,
డెయ్యది తాల్చి శబ్దగుణ మెల్లెడ నుండును, హేతుభూతమహా
నెయ్యది సర్వభూతముల, కెయ్యది ప్రాణము ప్రాణికోటి కెం,
దయ్యతులాష్ట దేహముల నందుశివుం డిడు మీకు భద్రముల్.

సూత్రధారుఁడు—(నాంది యైనతరువాత తెరవంకఁజూచి) ఓసీ! అలంకరించుకొనుట పూర్ణముగా నైనపక్షమున, నీవిటురమ్ము.

నటి—(ప్రవేశించి) అయ్యా! ఇదిగో వచ్చితిని. నే నేనియోగమును జేయవలయునో దేవర యాజ్ఞాపింతురుగాక!

సూత్ర—ఓసీ! ఈ సభ విద్వాంసులతో నిండియున్నది. ఇప్పుడు మనము కాళిదాసునిచేతఁ గ్రొత్తగా రచియింపఁబడిన యభిజ్ఞాన శాకుంతల మను నాటకముచేత వీరిని సేవింపఁదగును. కాఁబట్టి, సావధానముగా దాని ప్రయోగమును నడపవలెను.

నటి—చక్కఁగా నాడుటయందు సమర్థులైన తమ కే లోపమును రాదు.

సూత్ర—ఓసీ! నేను నీతో సత్యము పలికెదను.

గీ. తలఁప నాట్యప్రయోగకౌశలము మంచి
దంచుఁ, బండితుల్ సంతోష మందువఱకు;
నెంతయుఁ బ్రవీణు లనువారి హృదయమైనఁ,
జాల నమ్మకమిడ దాత్మశక్తియందు.

నటి—(వినయముతో) అని యట్టిదే. తరువాతఁ జేయఁదగినపని నిప్పుడే దేవర యాజ్ఞాపింపవలయును.

సూత్ర—ఈ సభవారి కర్ణరంజనముకంటె మఱియొకటి యే మున్నది?

నటి—ఇఁక నే నిప్పు డే ఋతువునుగుఱించి పాటపాడుదును?

సూత్ర—ఓసీ! ఇంతకుముందే వచ్చినదియు, భోగములకుఁ దగినదియు నైన యీ గ్రీష్మసమయమును గూర్చియే పాడవలెను. ఇప్పుడు—

గీ. హాయిగా స్నానములు చేయ ననువుపడుచుఁ,
బాటల సుగంధయుతవనపవన మమర,
సులముగ నీడలను నిద్రసుఖముకలిగి,
దివసములు రమ్యమగుఁజాలఁ జివరలందు.

నటి—అలాగే, (అని పాడుచున్నది.)

గీ. భ్రమరములచేతఁ జుంబింపఁబడియు, వింత
మృదువులగు కేసరంబుల తుదలు కలుగు
నల శిరీషపుష్పంబుల నతులదయను
జెలువలు ధరించుచున్నారు శిరసులందు.

సూత్ర—ఓసీ! చక్కఁగాఁ బాడితివి! ఆహా! రంగమంతటను మనస్సులు రాగమందుఁ దగులఁ జిత్తరువువలె నున్నది! కాఁబట్టి యిప్పుడే నాటకము నారంభించి వీరిని సంతోషపెట్టుదము!

నటి—ఓయీ! అభిజ్ఞానశాకుంతల మను పేరుగల యపూర్వ నాటక ప్రయోగముచేత వ్యవహరింతమని మొదటనే యాజ్ఞయిచ్చి యున్నావుగదా?

సూత్ర—ఓసీ! చక్కఁగా జ్ఞప్తికిఁ దెచ్చితివి! ఈ క్షణమున నేను మఱచిపోతిని సుమా! ఎందుచేతనన—

గీ. రమ్యమగు నీదు మృదు గీతరాగముసను
బలిమిమెయి సమాకర్షింపఁబడినవాఁడ;
లీల నతివేగనంతమా లేడిచేత
వడిగ దుష్యంతనృపుఁ డీడ్వఁబడినయట్లు.

ఇది ప్రస్తావన

శ్రీ

అభిజ్ఞాన

శాకుంతల నాటకము

ప్రథమాంకము

రంగము—కణ్వాశ్రమారణ్యము

(విల్లును, అమ్మును, కేలఁ దాలిచి, రథముపై నెక్కి, నొక్క జింకను
దఱుముచు సారథితోఁ గూడ దుష్యంతమహారాజు
ప్రవేశించుచున్నాఁడు.)

సూతుఁడు—(రాజువంకను, మృగమువంకను జూచి) దేవా!

గీ. ఆ మృగమును, నధిజ్యశరాసనంబుఁ
గరమున ధరించుమిమ్మును, గాంచ నాకు,
యజ్ఞ మృగమును వెన్నంటి యరుగునట్టి
యల పినాకపాణిని గన్నయట్ల యయ్యె.

రాజు—సూతుఁడా! మనల నీ సారంగము బహుదూరము గొని వచ్చినది. చూడు! అది మఱి యిప్పుడును—

చ. వడి బఱితెంచు తేరిదెసఁ బల్మఱు మార్మెడ పెట్టి చూచుచుం
గడు శరపాతభీతిఁ దనకాయము ముందుకుఁ గుంచి, యెంతయుం
బడలిక నోటినిం దెఱచి, మార్గమునిండ సగంబుతిన్న ద
ర్భలు పడ, మింటఁ బాఱెడు ధరం బదమూనక, పెద్దదాఁటులన్.

(విస్మయముతో) ఆ! ఏమిది! ఎంతవేగముగా వెంబడించుచున్నను ఇంత లోనే యది కనఁబడుట ప్రయత్న సాధ్య మయ్యెను!

సూతు—దేవా! నేల మిట్టపల్లములుగా నున్నదని గుఱ్ఱముల పగ్గములు బిగియఁబట్టి రథవేగము మందము నొందించితిని; అందు చేతనే మృగము మన కెడమయినది. ఇప్పుడు మనము సమప్రదేశ మునఁ జనుచున్నాము కాఁబట్టి దేవర కది లభింపకపోదు.

రాజు—అట్లయినఁ బగ్గముల సడల విడువుము.

సూతు—దేవర వా రాజ్ఞాపించినట్లు గావించెద. (అని రథ వేగము నిరూపించి) దేవా! ఇప్పుడు చూడుడు! చూడుడు!

ఉ. పగ్గముల న్సడల్చుడును, వాజులు మేనులు సాఁచి పాఱెడున్
నిగ్గగు చామరాగ్రములు నిశ్చలత న్వహియింపఁగాఁ, జెవుల్
దిగ్గన నిక్కఁబెట్టి తమ లేపిన ధూళికి నంటరానివై,
జెగ్గిలిపాఱు నా మృగము వేగము సైఁపక కూడఁబాఱునా.

రాజు—(సంతోషముతో) నిజముగా నీ హయులు సూర్యా శ్వములను, హరిణములను మించి పరుగెత్తుచున్నవి.

గీ. ఏది కడుఁ జిన్నదై యుండు నిప్పు డదియు
క్షణములోపల గొప్పదై కానుపించు;
నేది నిడుమను నెడ యుండి యెసఁగుచుండు
నదియు నొకటిగాఁ గలిసియున్నట్లు తోఁచు;

గీ. ప్రకృతిచేతను నెయ్యది వక్ర మగునొ
పరఁగ నయ్యది సమరేఖవలెనె యుండు;
దూర మిది చేరు విది యని తేరవడిని
నిర్ణయింపఁగరా దేకనిమిషమున నె.

సూతుఁడా! ఇదిగో హరిణంబును మరణంబు నొందించు చున్నాఁడఁ జూడుము. (అని వింట బాణమును సంధించుచున్నాఁడు.)

(తెరలోనుండి) ఓహో! రాజా! ఇది యాశ్రమమృగము. చంపఁదగినది కాదు; చంపఁదగినది కాదు.

సూతు—(ఆవంకఁజూచి యాలకించి) దేవా! ఇదిగో బాణ పాతదూరముననున్న యీ సారంగమునకును మనకును నడుమ నెవ్వరో జడదారులు వచ్చుచున్నారు.

రాజు—(తొట్రుపాటుతో) అట్లయిన గుఱ్ఱముల నిలుపుము.

సూతు—ఆలాగున నే. (అని రథము నిలుపుచున్నాఁడు.)

(అప్పు డిద్దఱు శిష్యులతో వైఖానసముని ప్రవేశించుచున్నాఁడు.)

వైఖా—(చేయెత్తి) రాజా! ఇది మా యాశ్రమ మృగము. చంపకుము, చంపకుము.

గీ. వలదు వల దల్ల బాణంబు వదలఁబోకు
మృదువయిన యీ కురంగంబు మేనిమీఁద
దారుణంబుగ మండెడు దహనశిఖను
విరుల మొత్తంబుమీఁదను విడుచునట్లు.

గీ. వజ్రసారంబు నిశితనిపాతఘోర
మట్టి నీ మార్గణం బేడ? యక్కటకట!
యరసి చూడంగ నత్యంత తరళమైన
యీ హరిణపోత జీవితం బిదియు నేడ?

గీ. కాన నిప్పుడ, మనుజేంద్ర! కార్ముకమునఁ
జక్క సంధించిన శరంబు సంహరింపు;
ఆర్తులను గావఁ బుట్టినయట్టి నీదు
శరము నిరపరాధులమీఁదఁ జనఁగఁదగునె?

రాజు—ఇదిగో! ఉపసంహరించినాఁడ. (అని చెప్పిన ట్లు చేయుచున్నాఁడు).

వైఖా——(హర్షముతో) ఇది పురువంశప్రదీపకుండవగు నీకే చెల్లినది.

క. ధరఁ బూరువంశజుండగు
దొరకుండగు నీక యిట్టి దొడ్డగుణంబుల్ ;
మరి నీవు ! బడయు మిటువలె
వరగుణములు గలుగు చక్రవర్తిం బుత్రుఁ !

శిష్యులు——(చేతులెత్తి) తప్పక చక్రవర్తి యగు కొడుకుం బడయుదువుగాత !

రాజు——(ప్రణమిల్లి) భూసురాశీర్వాదముం బ్రతిగ్రహించినాఁడ.

వైఖా——రాజా ! మే మిప్పుడు సమిధలందే బయిలుదేఱినారము. మాలినీతీరమునఁ గులపతులును మా గురువులును నగు కణ్వమహామునుల యాశ్రమ మిదె కానఁబడుచున్నది. కార్యాంతరభంగంబు వాటిలకుండు నేని, అందుఁ బ్రవేశించి యతిథిసత్కారంబుఁ గైకొనఁదగును.

గీ. పుణ్యాదములును నిర్విఘ్నములును నైన
యల తపోధనానుష్ఠానములను జూచి
'జ్యాకిణాంక మీ భుజమె కా యరసి యింత
దవ్వు రక్షించునది !' యని తెనరఁగలవు.

రాజు——కులపతు లగు గణ్వమహర్షు లిప్పు డాశ్రమముననే యున్నారుకదా ?

వైఖా——లేరు. అతిథి సత్కారార్థము తమకూఁతు శకుంతలను నియోగించి, యామెయొక్క ప్రతికూలదైవతం బ్రశాంతి నొందించు నిమిత్తము వారిప్పుడే సోమతీర్థమునకుం బోయినవారు.

రాజు——కానిండు; ఆమెనే కాంచెద, ఆమెయైన రాజభక్తి నమ్మహర్షికి విన్నవింపఁగలదు.

వైఖా—ఇఁక మేము మా పనికిం జనియెదము. (అని శిష్యులతోఁగూడ నిష్క్రమించును.)

రాజు—సూతుఁడా! అశ్వంబులం దోలుము. పుణ్యాశ్రమసందర్శనంబున మనగాత్రములం బవిత్రము గావించుకొందము.

సూతు—దేవరయాజ్ఞ ప్రకారము చేసెద. (అని రథమును వేగముగాఁ దోలుచున్నాఁడు.)

రాజు—(అంతటఁ గలయంజూచి) సూతుఁడా! ఇది చెప్పకున్నను, తపోవనముయొక్క పరిప్రాంతి యని తెలియ వచ్చుచున్నది!

సూతు—ఏలాగున?

రాజు—నీవు చూడవా యేమి? ఇదిగో—

సీ. చిలుకతొఱ్ఱల కందువులనోళ్ళనుండి ని
వ్వారిధాన్యములు జాఱెఁ దరులక్రింద,
నింగుదీఫలముల నిందందు నూఱిఁ
బొలుపుఁ దెల్పెఁడు నూనె గలుగుశిలలు;
విశ్వాసమునఁ జేసి వింతశబ్దము సైఁచి
మెదలక నిల్చె నీ మృగచయంబు,
వల్కలాంచలముల వలన జాఱిన వారి
ధారాంకితము లేటిదారు లొప్పె,
పవనాప్తిఁ గదలు కాలువనీటఁ దడిసిన
మూలంబులను నొప్పె భూరుహములు,
క్రమ్ముకొన్నట్టి యాజ్యధూమమ్ము చేతఁ
జిగురుటాకుల రాగంబు చెన్ను మాసె;
కుశలు కోసినకొనలను గొంకు లేక
మేసెడు కురంగశాబముల్ మెల్లమెల్ల.

సూతు—సర్వమును సరిగా నున్నది.

రాజు—(కొంచెము దూరము పోయి) సూతుఁడా! తపోవన వాసులకు బాధ కలుగరాదు. రథ మిక్కడనే నిలుపుము. నేను దిగియెదను.

సూతు—పగ్గములం బట్టినాఁడను. ఇఁక దేవర దిగవచ్చును.

రాజు—(దిగి తన వేషము జూచుకొని) సూతుఁడా! తపోవనంబులకుం బోవునపుడు వినయవేషంబులతోడనె చనవలయును గదా! వీనిం బట్టుకొమ్ము. (అని ధనస్సును, ఆభరణములును, సూతుని చేతి కిచ్చి) నే నాశ్రమవాసులం జూచి మరలి వచ్చునంతలోన గుఱ్ఱములం గడుగుము.

రాజు—(నడిచి యిటునటుఁ జూచి) ఇదే యాశ్రమద్వారము; లోనికిం జనియెదను. (ప్రవేశించి నిమిత్తమును సూచించి)

గీ. ఇది ప్రశాంతమౌ యాశ్రమపదము చూడ;
అదరెడు భుజంబు; ఫల మెట్టు లొదవు నిందు?
అట్టనఁగనేల? భాగ్యంబు లమర నున్న
కాలమందు. సర్వత్ర మార్గములు గలుగు.

(తెరమఱుఁగున) నెచ్చెలులారా! ఇక్కడ, ఇక్కడ.

రాజు—(చెవి యిచ్చి విని) ఇదిగో! సమీపమునఁ జెట్లచాటునకు దక్షిణమున మాటలవలె వినఁబడుచున్నవి. అచ్చటికిఁ బోయెదను. (వెళ్ళి చూచి) ఇదె యీ తపస్వికన్యలు తమశక్తికిం దగిన నీళ్ళకుండలతో లేతచెట్లకు నీళ్ళుపోయ నీ వైపునకే వచ్చుచున్నారు. (వారివంకఁ బాఱఁజూచి) ఓహో! వీరి దర్శన మెంత మనోహరముగా నున్నది!

గీ. ఆశ్రమంబున నున్న, నీ యతివజనము
లలితమూర్తి శుద్ధాంత దుర్లభము చూపె

యోగానుగా! యెందు నేని యుద్యానలతల
వనలతలె మించవే గుణగణము చేత!

కానిమ్ము. నే నీ చెట్లనీడను నిలిచి వీరివ్యాపారము గనిపెట్టెదను.

[పూర్వము చెప్పిన పనియందే ప్రవర్తించుచు సఖులతో
శకుంతల ప్రవేశించుచున్నది.]

శకుం—నెచ్చెలులారా! ఇక్కడ, ఇక్కడ.

అనసూయ—చెలియా! శకుంతలా! గురువులగు కాశ్యపులకు నీకంటె నీవృక్షములే ప్రియతరంబు లని నే ననుకొనియెదను. ఎందు చేత నందు వేని, ఈ నవమల్లికాకుసుమకోమలి వగు నిన్నును వీనిపాదములకు నీళ్ళుపోయ నియమించెను.

శకుం—ఓ అనసూయా! కేవల పితృనియోగమే గాదు. నాకును వీనియెడల సోదరస్నేహమే.

(అని చెట్లుఁ దడుపుట నభినయించుచున్నది.)

ప్రియంవద—సఖీ! శకుంతలా! ఇంత దనుక నీళ్లు పోసిన యాశ్రమవృక్షము లీ గ్రీష్మకాలమునం బుష్పించునవి. పుష్పించు కాలము గడచిపోయిన వృక్షముల కిప్పుడు నీళ్ళు పోయుదము. అందుచే మన కధికపుణ్యము వచ్చును.

శకుం—ఓ ప్రియంవదా! చక్కగా నాలోచించితివి.

(అని మరలఁ జెట్లుదడుపుట నభినయించుచున్నది.)

రాజు—ఈమె నేలాగునఁ గణ్వపుత్రి యనుకొందును? (విస్మయముతో) ఓహో! ఈమె నిట్లాశ్రమధర్మమునందు నియోగించిన పూజ్యుఁడయిన యా కాశ్యపుఁ డుచితాలోచన లేని వాఁడు గా నున్నాఁడు!

గీ. ఈ నిసర్గమనోహరం బైన మేని
నుగ్రతపములపాల్ సేయ నొప్పు నిమ్మ

ప్ర థ మాం క ము

హార్షి నీలోత్పలదళమ్మున నంచుచేతఁ
దా సమిల్లతలను గోయఁ దలఁచెఁ డెల్లు ?

ఔఁగాక ! చెట్లమఱుఁగున నుండియే వీరి కనుమానము పుట్ట కుండ నీమె జాడలఁ గనిపెట్టుచుండెద.

(అని యా ప్రకారము చేయుచున్నాడు.)

శకుం—అనసూయా ! ప్రియంవద దయమాలి స్తనవల్కలమ్మును గట్టిగా బిగించినది. దీనిని సడలింపుమా.

అన—అలాగుననే. (అని వదలుచేయుచున్నది.)

ప్రియం—(నవ్వుచు) ఇప్పుడు నీ గుబ్బల నుబ్బించిన నీ యౌవన ప్రాదుర్భావమును నిందించుకొమ్ము. ఊరక నన్నేల నిందించెదవు ?

రాజు—ప్రియంవద యథార్థము చెప్పినది.

గీ. పండుటాకులలోఁ గప్పబడినపూవు
భంగి, నిజశోభ నింతినవాంగికంబు
చూపలేదయ్యెఁ, జిఱుముడి మూపు నొఱయఁ
గవచనులయుబ్బు మాటువల్కలము చేత.

ఏమి ? ఈమె శరీరమున కీ వల్కలము తగనిదే యయినను, అలంకారశోభం బెంపుఁజెందింపకున్నది కాదు.

చ. నలినము శైవలంబునఁ బెనంగొని యుండియు రమ్యమే యగుఁ ;
మలినకళంకముం గలిగి మంజులత న్వహియించుఁ జంద్రుఁడున్ ;
చెలువున మించె నీజలజనేత్రయు వల్కలధారణంబునన్ ;
తలఁపఁగ సుందరాంగులకుఁ దాను విభూషణ మేదిగా దిలన్ !

మఱియు నా డెందంబునందు—

గీ. కఠినమయ్యు మృగాక్షి కీఁ గాంతవల్క
లమ్ము రుచిభంగ మీ దయ్యె లవము, విచక

కంజములు గల్గు నళినికిఁ గంఠ మిత
విడువఁబడిన కర్కశవృంతవితతి వోలె.

శకుం—(ముందునంతఁ జూచి) సఖులారా! ఈ పొగడచెట్టు గాలిచేఁ గదలుచిగురుఁగేల నన్నుఁ ద్వరపెట్టుచున్నట్లున్నది. దీనిం గారవింతము రండు. (అని యందఱు నడుచుచున్నారు.)

ప్రియం—సఖీ! శకుంతలా! ఇచ్చటనే మఱియొక నిమిషము నిలువుము.

శకుం—ఎందునిమిత్తము?

ప్రియం—నీవు దాపున నిలుచుటంజేసి యీ పొగడ వృక్షము లతతోడం గూడి యున్నట్లు ప్రకాశించుచున్నది.

శకుం—ప్రియంవదా! ఇందువల్లనేకదా నీవు ప్రియంవదవైతివి.

రాజు—ప్రియంవదా! ప్రియమయినను సత్యమే బలికితివి. ఈమెకు—

ఆ. వె. కిసలయంబుపగిదిఁ గెమ్మోవి తనరారు;
బాహువులు మృదువిటపములఁ బోలు;
అంగకముల నెల్ల నమరెను బరువంబు
వలపు గొలుపుఁ దగుచు నలరువోలె.

అన—సఖీ! శకుంతలా! 'వనజ్యోత్స్న' యని నీవు పేరు పెట్టుకొన్న యీ వనమాలిక యిప్పుడు బాలరసాలమునకు స్వయంవర వధువైనది. దీనిం జూచితివా?

శకుం—(లతయొద్దకుఁ బోయి చూచి) చెలియా! ఆహా! ఈ రమణీయ కాలమున, ఈ లతాపాదపమిథునమునకు నొండొరులం గలియుట సంభవించినది! నవకుసుమయౌవన యీ వనజ్యోత్స్న; పల్లవ రాగంబున నొప్పి భోగార్హ మయినది యీ చూతకుమారుడు. (అని చూచుచు నిలుచున్నది.)

ప్రియం—(చిఱునవ్వుతో) అనసూయా! ఎందుచేత శకుంతల 'వనజ్యోత్స్న' ను దడవుగఁ జూచుచున్నదో నీ వెఱుఁగుదువా?

అన—నే నూహింపఁజాలను. నీవే తెలుపుము.

ప్రియం—ఈ వనజ్యోత్స్న యే ప్రకారముగాఁ దగినపాదపముతోడఁ గూడినదో యా ప్రకారముగాఁ దానును తనకుఁ దగిన వరునిఁ బొందవలయు నని.

శకుం—(అనసూయతో) ఇది నిశ్చయముగా నీకు నీ మనసులో నున్నకోరిక. (అని జలకలశమును వంచుచున్నది.)

అన—ఓ శకుంతలా! జనకులగు కాశ్యపులచే నీవలెనే స్వహస్తముతోఁ బెంపఁబడినమాధవీలత యిది. దీని స్మఱచిపోతివిగదా?

శకుం—నన్ను నేను మఱతునేని, అప్పుడు దీని స్మఱతును. (లతను జూచి) ఆశ్చర్యము! ఆశ్చర్యము! ప్రియంవదా! నీ కొక్క ప్రియము చెప్పెదను.

ప్రియం—సఖీ! నాకుఁ బ్రియ మేది?

శకుం—అకాల మయినను, ఈ మాధవీలత యిప్పు డా మూలమును మొగ్గ దొడిగినది.

ఉభయ—(సత్వరముగాఁ జనుచు) చెలియరో! నిజముగానా! నిజముగానా?

శకుం—నిజముకాదా! మీరు చూడండి.

ప్రియ—(సంతోషముతోఁ జూచి) సఖీ! దీనిచేతనే నీకు నే నొక్క ప్రతిప్రియము చెప్పెదను.

శకుం—నాకుఁ బ్రతిప్రియ మేది?

ప్రియం—నీకుఁ బాణిగ్రహణము సమీపించుచున్నది—

శకుం—(అసూయతోఁ గూడినట్టుగా) ఇది నీ మనస్సులోని పిచ్చియూహ, కాఁబట్టి నీమాట నేను వినను.

ప్రియం—సఖీ! నేను పరిహాసముగాఁ జెప్పుచున్నదానఁగాను. ఇది నీ కళ్యాణసూచకమయిన నిమిత్తమని పూజ్యులగు కణ్వమహర్షుల ముఖమువలననే విన్నదానను.

అన—ప్రియంవదా! అందుచేతనేకదా శకుంతల యీ మాధవీలత కంత ప్రేమతో నీళ్లు పోయుచున్నది.

శకుం—అది నాకుఁ దోఁబుట్టువు కాఁబట్టి నే నెట్లు నీళ్ళు పోయకుండఁగలను? (అని కలశము వంచుచున్నది.)

రాజు—(మనస్సులో) నా మనోరథము దుర్లభ మేమో! ఈమె కులపతి యగు కణ్వునకు స్వజాతీయమైన భార్యయందుఁ బుట్టినది కాకుండవచ్చునా? తప్పఁ దలఁచితిని; సందేహింపఁబనిలేదు.

గీ. నృపపరిగ్రహయోగ్య యీ నెలఁతి నిజము;
కాక, నామది నిర్దోష మీకె నెట్లు
దవులు? నెందు సందేహ వస్తువులయందు
నాత్మగతులె ప్రమాణంబు లార్యులకును.

అయినను, ప్రత్యక్షముగా నే యీమె నెఱిఁగెద.

శకుం—(తొట్రుపాటుతో) నీళ్ళుపోయుటచేఁ బ్రముళ్ళిపడి, యీ తుమ్మెద నవమాలికాకుసుమమ్మును విడిచిపెట్టి నా నెమ్మోమునకు వ్రాల వచ్చుచున్నది! (అని భ్రమరబాధ నభినయించుచున్నది.)

రాజు—(ఆశమీఱ విలోకించి) మేలు! ఈమె పీడయును రమణీయముగానే యున్నది.

క. ఎందెందుఁ దిరుగుఁ దుమ్మెద,
యందందే బెళుకుఁగనుల నడరింపుచని
చ్చం ద్రిప్పెడు బొమ లలుకున
మందగమన దృష్టివిభ్రమము నేర్చెడునో!

(అసూయ కలిగినట్లుగా)

చ. కదలెడికల్కి వెళ్ళఁగడకన్నుల నంటెదు మాటిమాటికిన్;
పదిగ రహస్య మాడుగతిఁ బల్కెదు కర్ణముచెంతఁజేరి; బల్
ముదమున కాస్పదం బయినమోవిని గ్రోలెదు కేల్విదల్ప; మ
ట్పద! కృతివీవ; మేమె చెడువారము తత్త్వవిచార మగ్నతన్.

శకుం.— చెలులారా! నీతిమాలిన యీ తుమ్మెదచేత బాధింపఁ బడుచున్న నన్ను రక్షింపుఁడు.

ఇద్దఱు.—(చిఱునవ్వుతో) ఈ తపోవనంబులు రాజుచే రక్షింపఁ బడుచుండ, నిన్ను రక్షించుటకు మేమెవరము? దుష్యంతునిం బిలువుము.

రాజు.—(తనలో) బయల్పడుటకు నాకిదియ మంచిసమయము. (ప్రకాశముగా) భయపడవలదు— (అని సగముచెప్పి మనసులో) ఇట్లయిన రాజభావము వెల్లడియగును. అవుఁగాక! ఇట్లు పలికెదను.

శకుం.— ఈ దుష్టషట్పదము నన్ను వదలకున్నది. మఱియొక చోటికేఁగెద. (మఱియొక యడుగు నడచి నిలిచి చూపులు నిగిడించుచు) హో! హో! ఇదియేమి? ఇక్కడికిని వెంటఁబడుచున్నది!

రాజు.—(సత్వరముగా వచ్చి)

గీ. ఎవడవుర నీవు? ముగ్ధలా యీతపస్వి
కన్యకల వేఁప వచ్చితి కావరమున?
దుర్వినీతుల దండించు దుర్వినెల్లఁ
బౌరవుం డేలుచుండంగ భయము లేక.

(అందఱును రాజుంజూచి తత్తరపడుచున్నారు)

అన.—అయ్యా! ఇప్పుడు విశేషోపద్రవము మఱేమియు లేదు. మా ప్రియసఖయైన యీశకుంతల తుమ్మెదబాధవలన బెగడొందినది.

(అని శకుంతలం జూపుచున్నది)

రాజు—(శకుంతల వంకఁ దిరిగి) చక్కఁగాఁ దపస్సు వర్ధిల్లుచున్నదా ?

శకుం—(సిగ్గుచేతఁ దలవంచుకొని యూరకున్నది.)

అన—ఇప్పు డతిథిలాభముచేత మఱింత చక్కఁగా వర్ధిల్లుచున్నది.

ప్రియం—దేవరవారికి స్వాగతము. (అని శకుంతలవంకఁదిరిగి) సఖీ! శకుంతలా! నీవు పర్ణశాలకుఁ బోయి, పండ్లతోడఁగూడ బూజాద్రవ్యంబులం గొనిరమ్ము. ఇంతలో నీయుదకము పాదప్రక్షాళనంబున కుపయోగించును.

రాజు—ఏమియు నక్కఱలేదు. ఇప్పుడు మీప్రియవాక్యముల చేతనే. నా కాతిథ్యము జరిగినది.

అన—అట్లయిన ముహూర్తమాత్రము దేవర యీ చల్లని నీడగల యేడాకులయరఁటి చెట్టుక్రింది వేదికమీఁదఁ గూరుచుండి యలయికం దీర్చుకోఁదగును.

రాజు—పనిచేసి మీరును నలసి యున్నారు. ముహూర్తకాలము కూరుచుండుఁడు.

అన—సఖీ! శకుంతలా! మన కతిథిసేవయే యవశ్యకృత్యము. కాఁబట్టి, యిందుఁ గూర్చుండదము. (అని యందఱుఁ గూరుచున్నారు.)

శకుం—(ఆలోచించి మనసులో) ఇదియేమో కాని యీయనం జూచి తపోవనంబులం గానరాని యొకవికారంబునకు లోనయినదానను.

రాజు—(అందఱిని జూచి) ఓహో! మీ స్నేహము సమానమయిన వయసుచేతను రూపముచేతను రమణీయముగా నున్నది!

ప్రియం—(రహస్యముగా) అనసూయా! ఈయన యెవరు? చతురగంభీరాకారంబున, మధుర ప్రియవాక్యంబులం బలుకుచు రాజువలెఁ గానవచ్చుచున్నాఁడు.

అన—నాకును గౌతూహలమగుచున్నది. ఈయన నడిగెదను. (ప్రకాశముగా) దేవర వారి మధురాలాపంబులవలనంగలిగిన విశ్వాసము తమ్ముఁ గొన్నిసంగతుల నడుగ నన్నుఁ బ్రేరేచుచున్నది! తమచే నేరాజర్షి వంశ మలంకరింపఁబడుచున్నది? ఏదేశమందు జనులు దేవర వియోగమునకుం గుందుచున్నారు? సుకుమారమయ్యు నీశరీర మెందు నిమిత్తము తపోవనగమనపరిశ్రాంతిపాలు సేయఁబడినది?

శకుం—(మనసులో) హృదయమా! ఆరాటముస్మానుము. నీ వడుగఁదలఁచినదాని నీ యనసూయయే యడుగుచున్నది.

రాజు—(తనలో) నన్ను నేనేమని యిప్పుడు తెలుపుకొందును? ఏలాగున నన్ను నే మఱుంగుపెట్టుకొనైన నేర్తును? ఏమయినం గానిమ్ము; ఈ ప్రకారముగాఁ జెప్పెదను. (ప్రకాశముగా) పూరువంశసంభవుం డయిన రాజుచేత ధర్మాధికారమునందు నియోగింపఁబడినవాఁడ నయి, యాశ్రమవాసుల సత్క్రియానుష్ఠానములు నిర్విఘ్నములుగా నెగడుచుండుటం దెలిసికొన నీధర్మారణ్యంబునకు వచ్చినాఁడను.

అన—ధర్మమార్గమునం జరించు నాశ్రమవాసు లిప్పుడుగదా రక్షకుండు గలవారైరి.

శకుం—(శృంగారలజ్జ నభినయించుచున్నది.)

సఖులు—(ఉభయుల యాకారములం దెలిసికొని రహస్యముగా) సఖీ! శకుంతలా! పూజ్యులగు కణ్వమహాముని లిప్పు డిచ్చట నుండిరేని, —

శకుం—(రోషముతో) ఉండిన నేమి?

సఖు—తమ ప్రాణతుల్యమైన ధనమొసంగి యీయతిథి గృతార్థునిఁ గావింపఁగలరు.

శకుం—సఖులారా! వేఱొక్క టేదియో మనసున నుంచుకొని గూఢముగా మాటలాడెదరు. మీపలుకు లాలింపను.

రాజు—మేము నించుక మీ నెచ్చెలి వృత్తాంతము నడుగ వచ్చునా?

సఖు—దేవర యిట్లు కోరుట మా కనుగ్రహముకదా!

రాజు—మహానుభావుఁడగు కాశ్యపుఁడు శాశ్వతబ్రహ్మనిష్ఠుఁడని ప్రసిద్ధి. అట్టివాని కెట్లు మీ నెచ్చెలి కూఁతు రయ్యెను?

అన—దేవర యాకర్ణింపవలయును. కౌశికుండని వంశనామము గల మహాప్రభావసంపన్నుఁ డయిన రాజర్షి యొకఁడు కలఁడుకదా!

రాజు—కలఁడు; విని యున్నాము. అనంతరము!

అన—అతఁడే మా చెలియం గన్నవాఁడు. కన్నవారిచే విడువఁబడిన యీమెను బెంచుట మొదలుగాఁగల పనులు నిర్వర్తించుటం జేసి పూజ్యులగు కణ్వులును నీమెకు జనకు లయిరి.

రాజు—"విడువఁబడి" యను శబ్దశ్రవణముచేతనే వేడుక పొడముచున్నది. మొదటినుండియు వినఁగోరుచున్నాను.

అన—యవధరింపవలయును. పూర్వ మా రాజర్షి యుగ్రతపస్సు చేయుచుండఁగా, దేవతలు భయపడి యా నియమమునకు విఘ్న మాచరింప మేనక యను నచ్చరం బుచ్చిరి.

రాజు—దేవతల కీ పరతపోభయశీలత యెప్పుడు నున్నదియే. తర్వాత, తర్వాత?

అన—అంత నత్యంతరమణీయ మగు వసంతకాలమున నున్మాదమును బుట్టించు నామెరూపమును జూచి—(అని సగము చెప్పి లజ్జచే నూరకున్నది.)

రాజు—ఆపయిని దెలియనే తెలియుచున్నది. తప్పక యీమె యప్సరస్సంభవయే.

అన—సందేహ మేమి?

రాజు—స్పష్ట మగుచునే యున్నది.

క. అటువంటిరూప మారయ
నెటుపుట్టును మర్త్యచంచలేక్షణలందున్;
చటులప్రభాతరళ మగు
తటిల్లత జనింపఁగలదె ధారుణి నెందున్?

శకుం—(క్రిందఁ జూచుచుఁ గూరుచున్నది.)

రాజు—(మనసులో) నా మనోరథమున కవకాశమున్నది. అయినను, చెలికత్తియచేఁ బరిహాసముగా నుదాహరింపఁబడిన యీమె యొక్క వరవిషయకమైన ప్రార్థనను విని నా డెందము సందేహముచే నాందోళించుచున్నది.

ప్రియం—(చిఱునవ్వుతో శకుంతలవంకఁ జూచి, నాయకాభిముఖయై) దేవరవారు మఱియు నేమో పలుకఁ దలఁపు గలిగియున్నట్టు కనుపట్టుచున్నారు.

శకుం—(అంగుళిచే నచ్చెలిని బెదరించుచున్నది.)

రాజు—నీవు లెస్సగాఁ గనిపెట్టితివి. సచ్చరిత్రశ్రవణమునందలి యపేక్షవలన మఱియు నొకప్రశ్న యడుగవలసియేయున్నది.

ప్రియం—సందేహింపవలదు. తపస్విజనులను సంకోచము లేక యడుగఁదగును గదా?

రాజు—మీసఖినిగూర్చియె యెఱుఁగఁ గోరుచున్నాము.

ఉ. ఈరమణీలలామ హృదయేశున కీఁబడుదాఁకఁ గామువ్యా
పారనిరోధియైనవ్రతభారము దీనిని బూని యుండునా?
చారువిలోచనప్రభల సామ్యము వచ్చు కురంగభామినీ
వారముతోడ నిచ్చటనె వాసము నిత్యము చేయుచుండునా?

ప్రియం—దేవా! ధర్మాచరణమునందు సహిత మీతరుణి పరాధీనయే. అయిన నీమెం దగినవరున కీవలెననియే యెప్పుడును దండ్రి సంకల్పము.

రాజు—(సంతోషముతో మనసులో) ఆయన సంకల్పము దుర్లభము కాదు.

గీ. హృదయ! సాభిలాషివి గమ్ము యింక నీవు;
సంశయనివృత్తి యిత్తఱి సంభవించె;
ననల మని దేని భ్రమియించి తదియె యిప్పు
డంటఁగూడిన మానికమయ్యె జుమ్ము.

శకుం—(రోషముతోఁగూడినట్లుగా) అనసూయా! నేవెళ్ళెదను.

అన—ఎందునిమిత్తము?

శకుం—ఈ యసంబద్ధప్రలాపములను ప్రేలు ప్రియంవద కథ పూజ్యురాలయిన గౌతమితోఁ జెప్పుటకు.

అన—సత్కారముం బడయని యతిథిప్రశస్తు నిట్లు విడిచి పెట్టి మనసు వచ్చినట్లు పోవుట యాశ్రమవాసిను లగు నాఁడువారికి దగవుకాదు.

శకుం—(ఏమియు బదులు పలుకక బయలుదేఱెనది.)

రాజు—(తనలో)ఆ! ఎట్లుపోవుచున్నది! (కూడఁజనఁగోరు తన మనసును గ్రహించి) కాముకజనమనోవ్యాపారము చేష్టలతో సమాన మయినదిగానే యుండును! కావుననే నేనును—

క. మునిపుత్రిక వెంటంబడి
చనఁ జూచియు నిలువఁబడితి సౌశీల్యముచే
త నిపుడ, యిమ్ముఁ గదలకయుఁ
జని క్రమ్మఱ వచ్చినట్టి సరిగాఁ దోచున్.

ప్రియం—(శకుంతలం బట్టుకొని) సఖీ! నీవు పోఁగూడదు.

శకుం—(బొమముడితో) ఎందుచేత?

ప్రియం—నీవు నాకు రెండు చెట్లకు నీళ్ళుపోయ నప్పుపడి యున్నదానవు. కాఁబట్టి నాఋణము తీర్చి మఱి పోవుదువుగాని రా.

(అని బలాత్కారముగా మఱలించుచున్నది.)

రాజు—ఓ దయామయీ! నాకుం జూడ వృక్షములకు నీళ్ళు పోయుటవలననే యీమె యలసిపోయినట్లు తోఁచుచున్నది. ఔను గదా! ఈమెకు,

ఉ. కుండను బూన మూఁపు లవి క్రుంగెను, హస్తతలంబు లెఱ్ఱనై
యుండె, వడంకఁజొచ్చెఁగుచయుగ్మము, మిక్కిలియయ్యె శ్వాసముల్,
నిండెను మోమునందుఁ జెవినిడ్డ శిరీషము వాడఁజెమ్మటల్,
వెండ్రుకలుం గలంగె ముడిపిడఁగఁ దా నొకచేతఁ జెర్వటన్.

కావున నీమె ఋణమును నేను దీర్చెదను; కైకొనుఁడు.

(అని చేతియుంగరము నిచ్చుచున్నాఁడు.)

సఖులు—(పుచ్చుకొని నామముద్రాక్షరములఁ చదువుకొని యొకరినొకరు చూచుకొనుచున్నారు.)

రాజు—మమ్ము వేఱువిధముగా భావింపవలదు. రాజపురుషుల మగుటచే, మాకిది రాజువలన లభించినది.

ప్రియం—అందుచేతనే యీ యుంగరము దేవర వ్రేలి నెడఁ బాయఁ దగదు. తమమాటచేతనే యీమెఋణము తీఱిపోయినది.

అన—సఖీ! శకుంతలా! దయాళువయిన యీయనచే, లేక, యీ మహారాజుచే, నీ ఋణవిమోచన మయినది. ఇప్పుడు నీవు పోవచ్చును.

శకుం—(మనసులో) నేనే స్వతంత్రురాల నయితినేని—

ప్రియం—ఇంకను వెళ్ళవేమి?

శకుం——ఇప్పుడు నే నేమియు నీ యాజ్ఞకు లోఁబడియుండ లేదు. నాయిష్టము వచ్చినప్పుడు నేను బోయెదను.

రాజు——(శకుంతలం జూచి మనసులో) ఈమెమీఁద నా కెట్లున్నదో యీమెకును నామీఁద నట్లే యున్నదేమో! ఏలాగున నయిన నాకోరిక కవకాశ మున్నది. ఎట్లంటేని—

గీ. కలిసి మాటాడకున్న, నావలుకులకును
వీను లొగ్గెడు నభిముఖయై నెలంత;
వెలఁది నామోమున నె చూడక్క సిలుపకున్న,
నన్యవిషయంబులకుఁ బోవ దతివదృష్టి.

[తెరలో]

ఓహో! తపస్వులారా! మీరు తపోవనమునందలి జంతువుల రక్షింప సిద్ధముగా నుండుఁడు. మృగయావిహారి యగు దుష్యంత మహారాజు సమీపమున వచ్చుచున్నాఁడఁట.

గీ. కొమ్మలకుఁ గట్టి తడివల్కలమ్ము లున్న
యాశ్రమమహీజములయందు, హయఖురాళి
నడరుపెనుధూళి పడెడు సాయంతనంపు
టరుణరుచిఁ బొల్పు శలభచయంబువోలె.

రాజు——(మనసులో) అక్కటా! సైనికులు నన్ను వెదకుచు దపోవనంబులకు బాధ గలిగించుచున్నారు!

[మరల తెరలో]

ఓహో! తపస్వులారా! వృద్ధులును, స్త్రీలును, బాలురును, వ్యాకులపడ నిదిగో యేనుఁ గొకటి సంప్రాప్త మయినది.

చ. అరదముఁజూచి భీతి నొకహస్తి, కురంగసమూహ ముక్కటక,
దమవుప్రకాండముం బొడువ దంతముఖం బొకఁడంచు వోవఁగాఁ

జరణములం దగుల్కొనిన చారులతావళి నీడ్చుకొంచు, న
బ్బురముగఁ జొచ్చెఁబుణ్యవనమున్, వ్రతవిఘ్నమురూపుదాల్చెనాన్.

(అందఱును విని యించుక సంభ్రాంతలయి లేచుచున్నారు.)

రాజు—(మనసులో) అయ్యో! నేను తపస్వుల కపరాధము చేసినవాఁడ నయితిని! కానిమ్ము; నేఁ బోయి నివారించెదను.

సఖులు—దేవా! ఈ యడవియేనుఁగు వృత్తాంతముచేతఁ గలగుండు పడినారము. పర్ణశాలకుఁ జన ననుజ్ఞ యిమ్ము.

అన—సఖీ! శకుంతలా! పూజ్యురా లగు గౌతమి విచారించుచుండును. శీఘ్రముగా రమ్ము. అందరము నొకటిగాఁ గూడుకొందము.

శకుం—(నడవలేన ట్లభినయించుచు) హా! హా! నడవఁ గాళ్ళాడకున్నవి!

రాజు—(తొట్రుపాటుతో) మీరు యథేచ్ఛముగాఁ బొండి, మే మాశ్రమపీడ తొలఁగు ప్రయత్నముం గావించెదము. (అందఱును లేచుచున్నారు)

సఖులు—మీ మహత్త్వమును గుర్తెఱిఁగి యుపచారములు చేయమిం జేసి యిప్పుడు మీయెడ నపరాధల మయితిమి. క్షమియింపుఁడు. మాచే నర్హసత్కారముం బడయని దేవరను వెండియుఁ జూడ వేడుక గలదని విన్నవించుటకు మాకు లజ్జ యగుచున్నది.

రాజు—అట్లు కాదు. మీ దర్శనముచేతనే మేము సత్కృతుల మయితిమి.

శకుం—అనసూయా! సూదివంటి క్రొత్తదర్భపుడక నా పాదమునం గ్రుచ్చుకొన్నది; (మఱియొకయడుగు పోయి) చెలులారా! నా నారచీర కురవకవృక్షముయొక్క కొమ్మం జిక్కుకొన్నది. దీనిం దీసి

కొమవఱకు నిలిచి నన్ను వెంటఁ గొనిపోండు. (అని మిషపెట్టి రాజుం జూచుచు నాలస్యముగా సఖులతో నడచుచున్నది.)

రాజు—(నిట్టూర్పు పుచ్చి) అందఱుం జనిరి! కానీ నేనునుం జనియెదను. శకుంతలం బొడఁగాంచినది మొదలు నగరగమనమును గుఱించిన యుత్సాహము తగ్గినవాఁడ నైతిని. వెంట వచ్చినవారిం గలిసికొని తపోవనమునకు సమీపమున విడియించెదను. శకుంతలా వ్యాపారమునుండి నాడెందమును మరలింపఁజాలకున్నాఁడను—

గీ. నడచుచున్నది ముందుకు నాశరీర;
మాత్మ పరుగువాఱెడు వెన్కకవశ మగుచు,
మంచిగాలికి నెదురుగఁ గొంచుఁబోవు
ధ్వజమునకుఁ గట్టు పట్టువస్త్రంబువోలె.

(అందఱు నిష్క్రమించిరి.)

ద్వితీయాంకము

ప్రదేశము — ఆశ్రమారణ్యము.

[అప్పుడు విదూషకుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

విదూ — (నిట్టూర్పు విడిచి) హా! దైవమా! మృగయాశీలుఁడగు నీరాజు చెలిమిచేత మోసపోయితిని గదా! ఇదిగో మృగము, ఇదిగో వరాహము, అదిగో శార్దూలము అని మిట్టమధ్యాహ్నమున మండు వేసవికాల మగుటచేఁ బలుచని నీడలు గల యరణ్యమార్గముల నొక యడవినుండి యొక యడవికిఁ ద్రిప్పట యగుచున్నది. ఆకులు పడి చెడి పోయిన వెచ్చని కొండయేళ్ళ నీళ్ళు త్రాగ నబ్బుచున్నవి. వేళ తప్పి కఱకుట్లమాంసము భోజనమునకు సంభవ మగుచున్నది. గుఱ్ఱముల యొక్కయు నేనుఁగులయొక్కయు ధ్వనులచేత రాత్రి యైనను మంచి నిద్ర పట్టలేదు. పెద్ద తెల్లవాఱుజామున దాసిసకొడుకులు పిట్టవేఁటకాండ్రు చెవులు బద్దలుగా నఱచు వనగమన కోలాహలముచే మెలఁకువ వచ్చినది. ఇప్పటికిని పీడ పోలేదు. ఆమీఁద స్ఫోటకము మీఁద వ్రణ మైనది. నిన్న మేము వెనుకపడియుండ, లేడివెంబడి నాశ్రమపదమును బ్రవేశించిన యీ మహానుభావునకు నా దురదృష్టము చేత శకుంతల యను తాపసకన్య యొక్కతె కానఁబడినది. అప్పటి నుండియు నగరగమన మను కథయేనిఁ దలఁపెట్టఁడు. దీనినే యత్యంతము చింతించుచున్న నా కన్నులనె ప్రభాతమైనది. ఏమిగతి! సమయ కృత్యములం దీర్చుకొని, వేషముం దాల్చియున్న నా మిత్రునిం గాంచెదను. (అని వెళ్ళి చూచి) ఇదిగో చేతులయందు విండ్లు దాల్చి యడవి పువ్వులదండలు వేసికొని కిరాతకాంతలు తన్నుఁ జుట్టుకొని యుండఁ

జెలికాఁ డీలాగుననే వచ్చుచున్నాఁడు. రానిమ్ము. అంగభంగమునఁ గదలలేని వానివలె నుండెదను. ఈవిధమున నయినను గొంత విశ్రమము పొందెదను. (అని దండకాష్ఠము నానుకొని నిలుచున్నాఁడు)

[అంత, మున్ను చెప్పిన పరివారముతో రాజు ప్రవేశించుచున్నాఁడు.]

రాజు—(మనసులో)

గీ. కనఁగఁ బ్రియురాలు సులభగాఁ గానిపించ,
దామె భావముఁ గని మది యాసపడెడు;
నింక మరుపూన్కి తుదముట్ట దిప్పు డయిన,
నుభయులకు గోర్కు లానంద మొసఁగుచుండె.

(చిఱునవ్వునవ్వి) ఇట్లు కాముకుఁడు తన యభిప్రాయమున కనుగుణముగా నిష్టురాండ్రయొక్క చిత్తవృత్తులను భావించుకొని పరిహాసపాత్రుఁ డగును.

ఉ. నిద్దపుఁజూడ్కి నొండుకడ నేత్రము ద్రిప్పుటయుఁ, నితంబముల్
పెద్దవియౌట, మందగతిలీలను బోవుట, బోటు లాపి పో
వద్దనుచో నసూయమెయి వారలఁ బల్కుట, కాముకుండు తా
వద్దిర! సర్వ మాత్మవిషయంబుగనే కొనుచుండు నాత్మలోఁ.

విదూ—(ఆలాగుననే యుండి) ఓ వయస్యా! నాకరచరణంబులు గదలవు. వాఙ్మాత్రముచేతనే యాశీర్వదించెద. విజయీభవ!

రాజు—(చిఱునవ్వుతో) నీ కీ యంగవైకల్య మెందువలన గలిగినది?

విదూ—ఇదియేమి? స్వయముగానే కన్ను గలియఁబెట్టి కన్నీళ్లేలఁ బొడమెడు నని యడిగెదవు!

రాజు—నా కేమియుం దెలియకున్నదే!

విదూ—ఓ వయస్యా! ఆ ప్రబ్బమాను కుబ్జలీలను విడంబించుచున్నది. అది స్వభావముచేతనా? నదీవేగముచేతనా?

రాజు—నదీవేగమే యందునకుఁ గారణము.

విదూ—ఆ ప్రకారముగా నాకును నీవే!

రాజు—ఏప్రకారముగా?

విదూ—ఈ విధముగా నీవు రాజకార్యములను విడిచిపెట్టి, యిటువంటి వ్యాకులప్రదేశములయం దాటవికవృత్తి నుండఁదగితివి. నేనును నిశ్చయముగా, ప్రతిదినమును క్రూరమృగములను దోలుటచే కీళ్లు సడల నా యవయవములు నా యధీనములు గాకయున్నవి. కాఁబట్టి నాయం దనుగ్రహించి యొక్కదిన మయినను నన్ను విశ్రమము పొందుటకు వదలివేయుము.

రాజు—(మనస్సులో) వయస్యుఁడును నిట్లనుచున్నాఁడు; నాకును గణ్వాతనయం దలంచి డెందంబు వేఁటయందు విముఖ మగుచున్నది.

గీ. ఎపుడుఁ బ్రియురాలితోఁ గూడ నిచట నుండి
సొగసుఁజూపులఁ గఱపినమృగచయంబు
పయిని బాణంబుఁ బూనిచి వంచఁజాల
నెక్కుపెట్టిన యీవింటి నింక నేను.

విదూ—(రాజు మొగమువంకఁ జూచి) దేవా! ఏమో మనసున నుంచుకొని యాలోచించుచున్నావు. నాపలుకు లరణ్యరోదన మాయెను.

రాజు—(చిఱునవ్వు నవ్వి) మఱి యేమున్నది? మిత్రునిమాట దాఁటరాదని చింతించుచుంటిని.

విదూ—దీర్ఘాయుష్మంతుఁడవు గమ్ము. (అని చనఁబోవుచున్నాఁడు)

రాజు—మిత్రుఁడా! నిలువుము. నేనింకను నీతో మాటాడవలసియే యున్నది.

విదూ—దేవా! అనతిమ్ము.

రాజు—అలపు తీర్చుకొన్నపిమ్మట నీవు నాకొక్క యనాయాస కార్యంబునఁ దోడుపడవలయును.

విదూ—కుడుములు తినుటయందా?

రాజు—చెప్పెద నుండుము.

విదూ—ఊరకున్నాను.

రాజు—ఓరీ! ఎవఁడురా? అక్కడ.

దౌవారికుఁడు—(ప్రవేశించి) దేవా! ఆజ్ఞ యిండు.

రాజు—రైవతకా! సేనాపతిం బిలువుము.

దౌవా—ఆలాగుననే (అని నిష్క్రమించి సేనాపతితోడం గూడఁ బ్రవేశించి) ఇదె యాజ్ఞాపించువేడ్కతో భర్త యీవంకనే చూడ్కి నిగిడించి యున్నాఁడు. దేవర సందర్శించుకొమ్ము.

సేనాపతి—(రాజుపైఁ జూడ్కి వాలయించి) వేఁట దోష యుక్తముగాఁ గానఁబడునది యయ్యును, స్వామియెడఁ గేవలము మేలు చేయునదియే యైనది. ఎట్లంటేని,

చ. పొరిపొరి పూర్వ్య లాగుటను బూర్వశరీరము గట్టివాఱి, భా
స్కరకిరణాళి కెంతయును సైఁచుచుఁ జెమ్మట లేశమైననుం
బొరయక, చిక్కియుఁ దృఢతఁ బొందుటఁ బల్చనిమేన విక్రమ
స్థిరుఁ డయి యీతఁ డొప్పెడును జెల్వగ శైలచరద్విపం బనన్.

(దగ్గఱకు వచ్చి) స్వామీ! జయమవుఁగాక! ఈ యరణ్య మందుఁ గ్రూరసత్త్వముల సంచారముల నరికట్టినారము. ఇఁక నిచ్చట నుండనేల?

రాజు—సేనాపతీ! మాధవ్యుఁడు వేఁటను దూషించుటచేత నాకు దానిమీఁది యుత్సాహము పోయినది.

సేనా—(రహస్యముగా) వయస్యా! విదూషకా! నీ పట్టును వదలకుండుము. నేను స్వామిచిత్తవృత్తి ననుసరించి ప్రవర్తించెదను. (ప్రకాశముగా) ఈ మూర్ఖుని ప్రేలుకోనిండు. ఇక్కడ దేవరయే నిదర్శనముగా నున్నారు.

సీ. కడుపులోఁ గ్రొవ్వెల్లఁ గరగి యత్యంతంబు
నుదరంబు పలుచనై యొప్పెసంగు,
వ్యాయామమునఁ జేసి కాయంబు చులుకగా
నెత్తుట కర్హమై యేపుమీఱు,
జంతుసంతానహృదంతర భయకోప
ముల వికారములును దెలియ నగును,
శరము చలించు లక్ష్యమునందుఁ దాఁకిన
ధన్వికిఁ గరము సంతసము గలుగు,
వ్యసనమంచును వేఁటను బలుకుచుండు
రది యసత్యంబు కేవల మరసి చూడ,
వేఁటయే కానిపనియేని వేఱు దేనఁ
బుట్టు నిట్టివినోదంబు పుడమిమీఁద?

విదూ—(కోపముతో) రాజుగా రిప్పుడు తెలివిగలిగియే యున్నారు. నీవే వనచరుఁడవయి యడవడవిఁ దిరుగుచుఁ గడకు ముక్కు కండలు కబళింపఁగోరు నొకముదియెలుఁగునోటఁ బడియెదవు.

రాజు—భద్ర! సేనాపతీ! పలుపలుకు లేల! మన మాశ్రమ సమీపమున నున్నవారము కాఁబట్టి నీ మాటల కేము సమ్మతింప నేరము. ఇప్పుడు,

మ. మునుగం జెల్లు నిపానవారి మహిషంబుల్ కొమ్ములాడించుచున్,
పెనునీడ న్వసియించి లేళ్ళు నెమకు న్వేయం దగు న్గుంపులై,
పనిగాఁ బందులు ముస్తలెత్తఁ జను విశ్వాసంబునన్ గుంటలన్,
ధను విప్పట్టున విశ్రమింపఁగ నగున్ జ్యాబంధము న్బాయుచున్.

సేనా—ప్రభువు వారికి రుచించునట్లు కానిండు.

రాజు—అట్లయిన మున్ను పోయియున్న వలవేటకాండ్రఁ గ్రమ్మఱింపుము. మనసైనికులం దపోవనంబును విడిచి దూరంబుగఁ బోవునట్లు దిట్టము చేయవలయును. చూడు,

గీ. శాంతిపరులౌ తపోధనచంద్రులందు,
దహనశీలపూ తేజంబు దాఁగి యుండు;
తాఁకఁ దగియుండు సూర్యకాంతంబు లట్ల,
వెలికిఁ దార్తురు పరతేజ మడర దాని.

సేనా—స్వామి యానతిచ్చినట్లు.

విదూ—నీయుత్సాహవార్తలు చాలించి, తొత్తుకొడుకా! పో.

(సేనాపతి నిష్క్రమించెను.)

రాజు—(పరివారముఁ గాంచి) మీరు వేఁటవేషంబులఁదీయుఁడి. రైవతకా! నీవును నాయాజ్ఞ నడిపింపుము.

పరిజనము—దేవర యాజ్ఞాపించినట్లు. (అని నిష్క్రమించిరి)

విదూ—నీ విప్పు డీగనైన లేకుండఁ జేసితివి. ఇఁక దట్టములగు తీవజొంపములతోడఁ గూడిన యీ చెట్టునీడను గూరుచుండుము. నేనును సుఖాసీనుండ నయ్యెద.

రాజు—ముందు నడువుము.

విదూ—రమ్ము, నీవును రమ్ము.

(ఇద్దఱును నడిచి కూరుచున్నారు.)

రాజు—మాధవ్యా! నీవు కన్నులుగలఫలంబుఁ బొందలేదు. ఏలయన—నీవు దర్శనీయ మగు పదార్థముం జూడకపోతివి.

విదూ—అదేమి? నీవు నాయెదుటనే యున్నావే!

రాజు—ఎల్లవారుం దమవారిని మనోహరమయిన వారినిగానే చూచుకొందురు. నేనన్ననో యీ యాశ్రమమున కలంకారభూతయగు నా శకుంతలంగూర్చి చెప్పుచున్నాను.

విదూ—(తనలో) కానీ నే నీయనకు సందీయకుండెదను. (బిగ్గరగా) ఓ మిత్రుఁడా! ఇప్పుడు తాపసకన్యను సహితము కామించు చున్నట్టు కనఁబడుచున్నావే!

రాజు—సఖా! పరిహార్యవస్తువుమీఁదికిఁ బౌరవుల మనస్సు పోదు.

విదూ—అట్లయిన నిది యేమి?

రాజు—గీ. అప్సరస్త్రీని జన్మించి యామెచేత
విడువఁబడి మౌనికి లభించె వెలఁది యామె
చెట్టునను జాతి జిల్లేడు చెట్టుమీఁదఁ
బడిన నవమాలికాప్రసవంబుపగిది.

విదూ—(నవ్వి) ఓ మిత్రుఁడా! ముద్దఖర్జూరంబు రుచియింపని వానికిఁ జింతపండుమీఁద బుద్ధిపోయినట్లు, స్త్రీరత్నములఁ బాటింపని నీకీ కోరిక పుట్టినది.

రాజు—ఆమెం జూచినవాఁడవు గావుగావున నీవిట్లు పలుకుచున్నావు.

విదూ—నీకును వింతఁ బుట్టించుటంజేసి యామె సుందరియే కావచ్చును.

రాజు—వయస్యా! పెక్కేల!

ఉ. చిత్రమునందు వ్రాసి తగ జీవము పోసి విధాత తాను లో
కోత్తరరూపబృందముల నుల్లమునం దలపోసి చేసెనో
యుత్తమనీలలామ నన నీ డొడఁగూడక చెన్నుమీఱెడుక్,
దత్తనురామణీయకము ధాతసమర్థతయుం దలంపఁగక్;

విదూ—అట్లయినచో, ఇఁకఁ జక్కనిస్త్రీలకెల్లను పరాభవమే యగును.

రాజు—నా మనసున కట్లే తోఁచుచున్నది.

ఉ. వాసన చూడనట్టి ప్రసవంబు, నఖంబులఁ ద్రుంపనట్టి నూ
త్నాసమపల్లవంబుఁ, బరు లానని క్రొవ్విరితేనె, నూచి వి
న్యాసము లేసిరత్నము, మహాతతపుణ్యఫలంబుఁ బోలు నా
భాసురగాత్రి సోయగ మెవండు భుజింప విరించి వ్రాసెనో!

విదూ—అట్లయిన, గారనూనెచేఁ జిక్కనైన యొకయరణ్య వాసి యయిన తపస్వియొక్క చేతిలోఁ బడకమునుపే నీ వామెను శీఘ్రముగా దక్కించుకొనుము.

రాజు—పరాధీనురాలుగదా యామె? ఇప్పు డామెజనకులును దగ్గఱ లేరు.

విదూ—మఱి నీయందామె కెట్టియనురాగము గలదు?

రాజు—తపస్వికన్యలు స్వభావముచేతఁ బ్రగల్భురాండ్రు కారు గదా! అయినను—

గీ. ఏ నభిముఖుండఁగా జూపు నిట్టె త్రిప్పె,
నన్యకారణమున నవ్వినట్లు నవ్వెఁ,
గావున మదుండు శీలంబుకలిమి నడఁగి
స్పష్టమును గూఢమునుగాక పరఁగి యుండె.

విదూ—ఏమి! అట్లుగాక చూచినంతమాత్రమున నీతొడ మీఁద వచ్చి కూర్చుండునా?

రాజు—సఖులతోఁగూడి వెళ్ళునప్పుడు వినయవతి యయ్యును మిక్కిలి నాయెడ భావమును గనఁబఱిచినది. అట్లెకదా!

గీ. చరణమునఁ గ్రుచ్చుకొనెఁ గుశాంకుర మటంచుఁ
గొన్నియడుగులె నడచి యాకొమ్మ నిలిచె;
తిరువుశాఖల వస్త్రంబు తగుల కున్నఁ
దీసికొనుదానివలె వెన్కఁ దిరిగిచూచె.

విదూ—ఇట్లు నీకు బత్తెంబు లభించునేని, యిఁక నీ పీ తపోవనమునే యుద్యానవనముగాఁ జేసికొందువని తలంచెదను.

రాజు—మిత్రుఁడా! ఇక్కడి తపస్వులు కొందఱు నన్నాన వాలు పట్టిరి. మన మొకసారి యేమిషచేత మరల నీ యాశ్రమమును బ్రవేశింతమో యాలోచన చెప్పుము.

విదూ—మఱియొక యాలోచన యెందుకు! నీవు రాజువు కావా?

రాజు—అయిన నేమి?

విదూ—నీవారధాన్యములో నాఱవభాగము మాకు రావలె నని చెప్పుదము.

రాజు—ఓయి మూర్ఖుఁడా! వీరలను పరిపాలించినందునకయి, రత్నరాసుల నయినను విడిచిపెట్టి చేకొనందగిన మఱియొక భాగధేయము లభించుచున్నది. చూడుము.

గీ. ప్రజలవలన భూమిపతులకు లభియించు
ఫలము క్షయము చెందఁగలది యగును;
తాపసేంద్రు లిచ్చుతపముల యాఱవ
భాగ మక్షయముగఁ బరఁగు మాకు.

(నేపథ్యమునందు)—ఆహా! మేము కృతార్థుల మయితిమి.

రాజు—(చెవియిచ్చి) ఓహో! ఇది ధీరప్రశాంతమగు స్వరము, తపస్వులు కాఁబోలును!

[దౌవారికుఁడు ప్రవేశించుచున్నాఁడు]

దౌవా—దేవా! జయమగుఁగాక! ఇద్దఱు ఋషికుమారులు వెలుపల నిలచియున్నారు.

రాజు—అట్లయిన, వారి నాలస్యము చేయక లోపలికిం దోడ్కొని రమ్ము.

దౌవా—తీసికొని వచ్చెదను. (అని వెళ్ళి ఋషికుమారులలోఁ బ్రవేశించుచున్నాఁడు) ఇటు ఇటు. పూజ్యులారా! (ఇద్దఱును రాజువంకఁ జూచుచున్నారు.)

ప్రథ—అహో! ఈయనమూర్తి తేజోవంతె మయ్యును విశ్వసనీయముగా నున్నది! ఋషులకంటె నతిభిన్నుఁడు కాని రాజువం దిట్లుండుట యుక్తమే. ఎట్లన -

చ. అరయగ సర్వభోగ్యమగు నాశ్రమమందితఁడుండు, నిత్యముల్
వరపరిపాలనంబునఁ దపఃఫల మాఱవపాలు గాంచు, నం
బరతల మంటు ఋష్యభిధ పావనరాజపదానుపూర్వమై
సరసతమీఱఁ బాడు పటుచారణగీతములందు మాటికిన్.

ద్వితీ—గౌతమా! ఈ పార్థివుడు దేవేంద్రసఖుఁ డయిన దుష్యంతుఁడా?

ప్రథ—మఱి యేమి!

ద్వితీ—అట్లగుట చేతనేకదా!

చ. పురపరిఘాతి దీర్ఘభుజముల్గల యీతఁడు శ్యామలాబ్ధి యా
వరణముగాఁగఁ గల్గు మహిభారము నొక్కఁడె పూను టబ్రమే?
సురయువతుల్ సురాహితుల క్షోభలు పుట్టిన నో జయార్థ మీ
వరదునధిజ్యకార్ముకము వాసవువజ్రముఁ గోరుచుండఁగన్.

ఇద్ద—(సమీపమునకు వెళ్ళి) రాజా! నీకు జయమగుగాక!

రాజు—(పీఠమునుండి లేచి) మీకు నమస్కరించుచున్నాను.

ఇద్ద—మీకు మే లగుఁగాక!

(అని ఫలములు కానుక యిచ్చుచున్నారు.)

రాజు—(నమస్కార పూర్వకముగా స్వీకరించి) మీ యాజ్ఞకయి వేచియున్నాను.

ఇద్ద—మీ రిక్కడ నుండుట యాశ్రమవాసు లెఱిఁగి మిమ్మొ క్కటి ప్రార్థించుచున్నారు.

రాజు—వా రేమని యాజ్ఞాపించుచున్నారు ?

ఇద్ద—పూజ్యులైన కణ్వమహర్షులు దగ్గఱలేనందున, రాక్షసులు యజ్ఞమునకు విఘ్నము చేయుదురు. కాఁబట్టి, కొన్ని రాత్రులు మీరు సారథిద్వితీయులరై యాయుధపాణులై యుండి యీ యాశ్రమ మును సనాథమునుగాఁ జేయవలయునని.

రాజు—నా కది యనుగ్రహమేకదా !

విదూ—(రహస్యముగా) ఇప్పు డీ ప్రార్థన యనుకూల మయినదే.

రాజు—రైవతకా ! ధనుర్బాణ సహితముగా రథమ్మును గొని రమ్మని సారథితో నా పలుకులుగాఁ జెప్పుము.

దౌవా—దేవా ! జయమగుఁగాక ! దేవర యాజ్ఞాపించునట్లు చేసెద. (అని నిష్క్రమించుచున్నాఁడు.)

ఇద్ద—(హర్షముతో)

గీ. వినుము పూర్వుల మార్గంబు ననుసరించు
నీకు నియ్యది యుక్తంబు నిక్కువముగ ;
నవని నాపన్న రక్షణ యాగమందు
దీక్షితులుగారె పౌరవుల్ ; ధీవిశాల !

రాజు—మీరు ముందుగా నడువుఁడు. నేనును మీ వెనుకనే వచ్చెదను.

ఇద్ద—రాజా ! నీకు జయమగుఁగాక ! (అని నిష్క్రమించిరి)

రాజు—మాధవ్యా ! నీకు శకుంతలాదర్శన కుతూహలము గలదా ?

ముగుద యిది యేడ! పరిహాసమునకు నేను
బలుఁకు మా మాటలు నిజమని తలఁపవలదు.

విదూ.—ఆలాగే.

రాజు—వయస్యా! నీవు నీ కార్యమునం బ్రవర్తిల్లుము; నేనును దపోవనరక్షణార్థ మక్కడికి వెళ్ళెదను.

(అందఱు నిష్క్రమించుచున్నారు.)

తృతీయాంకము

రంగము—తాపసాశ్రమము

[దర్భలు చేతఁబట్టుకొని కణ్వశిష్యుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

శిష్యు—(ఆలోచించి విస్మయముతో) ఆహా! దుష్యంత మహారాజు మహానుభావుఁడు గదా! పూజ్యుఁడైన యాతఁ డాశ్రమపదమును బ్రవేశించిన మాత్రముననే మా కర్మానుష్ఠానములు నిరపాయముగాఁ జెల్లినవి.

గీ. భయద హుంకారమో యనఁబరఁగు వింటి
నారిశబ్దముచేతనె దూరమునను
విఘ్నములఁ బాఱఁదోలుచు వెలయు నతఁడు
బాణసంధానకథ యేల వలయునింక!

వేదికమీఁదఁ బఱచుటకయి యీ దర్భలను ఋత్విక్కులనిమిత్తము నేను దీసికొని పోవలెను. (కొంచము నడచి చూచి, ఆకాశమునందు) ప్రియంవదా! ఈ యుశీరానులేపనమును, మృణాళములతోఁ గూడిన పద్మపత్రములను నీ వెవరి నిమిత్తము కొనిపోవుచున్నావు? ఎండఁబడుటచేత శకుంతల మిక్కిలి యస్వస్థయైయున్నదా? ఆమె శరీరసంతాపనివారణార్థమా? అట్లయిన శీఘ్రముగా చికిత్స చేయుము. ఆమె కులపతి యగు కణ్వుని రెండవ ప్రాణముగదా! నేనును వితానయాగము యొక్క శాంతిజలము నామెకొఱకు గౌతమిచేతి కిచ్చెదను.

(అని నిష్క్రమించుచున్నాఁడు.)

ఇది విష్కంభము.

[తరువాత మన్మథావస్థ నటించుచు రాజు ప్రవేశించుచున్నాఁడు]

రాజు—(నిట్టూర్పు పుచ్చి) ఆలోచించుచు

గీ. ఎఱుఁగుదుఁ దపశ్ప్రభావ; మా యిందువదన
కడుఁ బరాధీనురా లని యెడఁద నాకుఁ
దెలియు; నట్లయ్యు మనసు నా లలనమీఁది
నుండి మరలించుకొనఁ జాల కున్నవాఁడ.

(మదనబాధ నిరూపించి) పూజ్యుఁడైన యో పుష్పాస్త్రుఁడా! నీవును జంద్రుఁడును విశ్వసనీయులుగాఁ గనఁబడుచు, కాముకజనమును మోస పుచ్చుచున్నారు. ఎట్లన—

ఉ. భూతలమందు నీదయిన పుష్పశరత్వము, నీరజారిదౌ
శీతకరత్వమున్, మదన! చెడ్డయసత్యము లయ్యె మా యెడన్
శీతకరుండు నిప్పులను జిమ్ముఁగఁ జొచ్చె హిమాంశుపాళిచే;
నీతతి వజ్రసారముల నీవు నొనర్చెదు పూవుటమ్ములన్.

ఓ భగవానుఁడా! కామదేవా! నీకు నాయెడఁ గనికరము లేదా? (మదనబాధ నిరూపించి) పుష్పాయుధుఁడ వైన నీకీ తీక్ష్ణత్వ మెట్లు కలిగినది? ఆ! తెలిసినది!

గీ. వనధిలోపల బాడబవహ్నిఁబోలె
హరునికోపాగ్ని నీలోన నడఁగి యుండు;
నట్లు గాకున్న, బూడిద యైననీవు
వెచ్చ నగు టెట్లు మముబోఁటి విరహులకును?

అట్లుకాదు.

క. మరుఁడు సదా నా హృదయముఁ
గరమును బాధించుచున్నఁ, గామినికొఱకే
శరము లడరించుఁ గావునఁ
బరమాప్తుఁ డతండు నాకుఁ బరికింపంగన్.

భగవానుఁడవైన కందర్పుఁడా! ఈ ప్రకారముగా నుపాలంభింపఁబడుచున్నను నీకు నన్నుఁగూర్చి పరితాపము కలుగకున్నది!

గీ. ఎపుడు సంకల్పశతముల నీ వనంగ!
వడిగ నీచేతఁ బోషింపఁబడితి కానఁ
బూని చాప మాకర్ణాంతముగను లాగి
బాణమోక్షంబు నాపైనె వలయుఁ జేయ.

(ఖేదముతోఁ గొంచెము నడచి) యజ్ఞకర్మ పరిసమాప్తినొందినందున సదస్యులచే వీడుకోల్పఁబడిన నేను విరహపీడనొందిన యీ డెందము నెట్లు వినోదింపఁజేయుదును? (నిట్టూర్పువిడిచి) ఇప్పుడు ప్రియురాలిదర్శనమునకంటె నాకు శరణ్య మన్య మేదియునులేదు. కాఁబట్టి యామెనే వెదకెదను. (సూర్యునివంకఁ జూచి) ఈ యుగ్రమైన యెండవేళను లతావలయ సంపన్నములైన మాలినీ తీరములయందు శకుంతల ప్రాయికముగా చెలికత్తెలతోడ విహరింపబోవుచుండును. అక్కడికే వెళ్ళెదను. (వెళ్ళిచూచి) ఈ బాలపాదపపంక్తులనుబట్టి యీ కోమలాంగి యిప్పుడే వెళ్ళినదని యూహించెద. ఎట్లన—

గీ. అవిగో! నాయింతిచేతఁ గోయంగఁబడిన
పూలబంధన కోశముల్ మొగుడవింక;
చాల గిసలయచ్ఛేదముల్ పాలు గారు
చిచటఁ గన్పట్టుచున్నవి మృదువుగాను.

(స్పర్శసుఖము నిరూపించి) ఆహా! ఈ ప్రదేశము మహత్తరమయిన గాలిచే మనోహరముగా నున్నది!

గీ. తోయజాతసువాసనతోడఁ గూడి
మాలినీతరంగజలకణాళిఁ దాల్చి
యనిల మిచట గాఢాలింగనార్హ మయ్యెఁ
గామతప్తమదీయాంగకములకిపుడు.

(నడచి చూచి) నిజముగా శకుంతల ప్రబ్బచెట్లచేఁ జుట్ట బడిన యీ లతామండపమునందు సన్నిహితురా లయి యున్నది! అట్లే కదా—

గీ. ఇదిగో ద్వారముకడఁ దెల్లయిసుకలోన
జఘనభారంబునను వెన్కఁ జాలలోఁతు
గాను ముందు ప్రక్కను నెత్తుగాను నున్న
క్రొత్త యడుగుజాడలు కనుంగొనఁగ నయ్యె.

కాఁబట్టి చెట్లచాటునుండి చూచెదను. (వెళ్ళి, ఆ ప్రకారముగాచేసి సంతోషముతో) ఆహా! ఇప్పుడు నేత్రసాఫల్యము కలిగినది! నా మనోరథ ప్రియతమురాలయిన యీమె కుసుమాస్తరణ శిలాపట్టము నధిశయినించి సఖులచే సేవింపబడుచున్నది. కానిమ్ము, వీరి యేకాంతపు మాటలను వినియెదను. (అని చూచుచు నిలుచున్నాఁడు.

[అప్పుడు యథోక్తవ్యాపార యగు శకుంతల సఖులతో ప్రవేశించుచున్నది.]

సఖులు—(విసరుచు) సస్నేహముగా సఖీ! శకుంతలా! నీ కీ తామరాకుల గాలి హాయిగా నున్నదా?

శకుం—చెలులారా! ఏల విసరెదరు?

సఖు—(విషాదమును నటించి యొకరినొకరు చూచుచున్నారు)

రాజు—పూజ్యురాలయిన శకుంతల యెంతయు నస్వస్థచిత్తురాలుగాఁ గనఁబడుచున్నది. (ఆలోచనతో) అది యాతపదోషమో! మదనదోషమో! ఈ రెంటిచేతను నని నాకుఁ దోచుచున్నది. సందేహ మెందుకు?

చ. స్తనములయం దుశీరమును జాఱినయట్టి మృణాలహారముం
బొనర లతాంగిమేను కడుఁబొల్పరి యుండియు శోభ చెందెడుం;

దనరు నిదాఘమన్మథులతాఁకునఁ దాపము తుల్యమౌచు; నై
నను నిటు సోయగం బిడుగుణం బల గ్రీష్మమునందు లేదెటన్.

ప్రియం.—(రహస్యముగా) అనసూయా! ఆ రాజేంద్రుని యొక్క ప్రథమదర్శనము మొదలుకొని శకుంతల గాఢానురాగముచేత వెత నొందుచున్నది. అతని నిమిత్తముననే యీమెకీ తాపము కలుగుచున్నదా యేమి?

అన—సఖీ! నాకును మనసునందీ శంకయే కలుగుచున్నది. కానీ యిప్పుడీమె నడిగెదను. (ప్రకాశముగా) చెలియా! నిన్నొక్కటి యడుగవలసి యున్నది. నీకు సంతాప మధికముగా నున్నదిగదా?

రాజు—ఇప్పుడు చెప్పక తీఱదు.

గీ. చంద్రకిరణంబులును బోలె స్వచ్ఛమైన
యీమెసుమృణాలహారము లిపుడు కరము
నవిగొనలు పెక్కు దుస్సహమైనయట్టి
గ్రీష్మమును దెల్పుచున్నవి కేవలమును.

శకుం.—(పూలపాన్పునుండి సగము లేచి) సఖీ! ఏమి తెలియఁ గోరెదవు?

అన—సఖీ! శకుంతలా! కామవిషయమైన వృత్తాంతములకు నీకు మే మరమర లేనివారము గదా? పురాణేతిహాసములయందు విరహుల విషయమయి విన్నయవస్థ యిప్పుడు నీయందు నాకుం గనబడుచున్నది. నీకీ యాయాస మెందువలనఁ గలిగినదో చెప్పు. వికారకారణము యథార్థముగాఁ దెలియక ప్రతిక్రియ కారంభింపరాదు కదా?

రాజు—నాకుఁ బుట్టినయూహయే యనసూయకును గలిగినది.

శకుం.—(తనలో) నాకాయాసము బలముగానున్నది. అయినను వీరికి వేగిరము తెలుపుటకు శక్తురాలను గాకున్నాను.

ప్రియం—సఖీ! ఈమె చెప్పినది బాగుగనున్నది. నీవ్యాధి నేల యుపేక్ష చేసెదవు? నీవు నానాఁటికి చిక్కుచున్నావు. లావణ్యసహిత మయిన ఛాయ యొక్కటియే నిన్ను విడువకున్నది.

రాజు—ప్రియంవద సత్యమే పలికినది, అవును.

చ. మొగమునఁ జెక్కులెండెఁ, గుచముల్ కఠినత్వముఁ దూలె నొమ్మునన్
వగచెడి సోలె నెన్నడుము; వంగెను మూఁపులు; మేను పాండురం
బగుచుఁ దనర్చె; నియ్యువతి యాకులు శోషిలి గాలి సోఁకకే
తగియెడు మాధవీలతవిధంబునఁ దర్పక తాపబాధచే
నగపడె శోచనీయయు బృహత్ప్రియదర్శన యాచు నెంతయున్.

శకుం—(లజ్జతో) సఖీ! మీకుఁ జెప్పక మఱి యెవ్వరికి జెప్పుదును? మఱి యేల చెప్పనందురేని, ఇప్పుడు చెప్పిన మిమ్మా యాసపెట్టినదాన నగుదును.

సఖు—అందుచేతనే నిన్నింత నిర్బంధపెట్టుచున్నాము. దుఃఖమును చెలులు పంచుకొన్నప్పుడుగదా వేదన సహ్యముగా నుండును!

రాజు—

చ. సమసుఖదుఃఖలై పరఁగు సారసనేత్రలు తన్ను వేఁడుటన్
సుముఖత హృద్గతార్తికథ సుందరి తెల్పక మాన దింక; నే
త్రము లటువిప్పి యాశమెయిఁ దత్సతి పల్పులు నన్నుఁ జూచినన్,
హిమకరసన్నిభాస్య యిపు డేమనునో విన భీతి పుట్టెడున్.

శకుం—(లజ్జతో) ఈ తపోవనరక్షకుఁడయి వచ్చిన రాజేంద్రుఁ డెప్పుడు నాదృష్టిపథమునఁ బడెనో—(అని సగము చెప్పి లజ్జనటించుచున్నది)

సఖు—ప్రియసఖీ! చెప్పు చెప్పు.

శకుం.—అప్పటినుండియు నాతనియందలి యభిలాషచేత నిటు వంటి యవస్థపాలైనదానను.

రాజు — (హర్షముతో) చిరకాలమునకు వినఁదగినమాట వింటిని.

గీ. జంతువితతికి గ్రీష్మావసానమునను
జలధరశ్యామ మగు దివసంబుఁ బోలె,
సించువిలుకాఁడె నాతాపహేతువయ్యె
నతఁడు తాపనివారకుఁ డయ్యె నిపుడు

శకుం.—మీ కిది యనుమత మయ్యేనేని, ఆ రాజేంద్రుఁడు నాయెడ దయచూచు మార్గము చూడుఁడు. లేకున్న నిఁక నాకు నీళ్ళు విడువుఁడు.

రాజు.—ఇది యాలోచించి చెప్పినమాట కాదు. కాముకుల కెప్పుడును వివేక ముండదుకదా!

ప్రియం.—(రహస్యముగా) అనసూయా! దీనికి కామ మతి దూరము వెళ్ళినది. ఇఁకఁ గాలహరణమున కోర్వఁజాలదు. ఈమె మనసునం దగిలినవాఁడు పూరువంశభూషణుఁడు. కాఁబట్టి యీమె యభిలాష కొనియాడఁదగినదే.

అన.—(రహస్యముగా) చక్కఁగాఁ జెప్పినావు.

ప్రియం.—సఖీ! మేలు! నీకుఁ దగినకోరిక కోరినావు! మహా నది రత్నాకరమును విడిచి మఱి యెక్కడ చేరును!

అన.—ఎలమావితప్ప చిగిర్చిన మాధవీలతకుఁ దగినవృక్షము మఱి యేదియున్నది!

రాజు.—విశాఖ చంద్రకళ ననుసరించునేని, అందు చిత్రమే మున్నది!

అన— మన చెలియొక్క మనోరథమును శీఘ్రముగాను గూఢముగాను సమకూర్చుట కిప్పు డేమి యుపాయము ?

ప్రియం—శీఘ్రముగా చేయవచ్చును గాని గూఢముగా చేయుటమాత్ర మాలోచనీయము.

అన—ఏల ?

ప్రియం—ఓసీ ! ఆ రాజేంద్రుఁ డీమెయందు ప్రేమాస్పదము లైన చూపులచే నభిలాషను గనఁబఱుచుచు నిన్నాళ్ళను నిద్రలేక పోవుటచేతఁ గృశించినట్లు కనఁబడుచున్నాఁడు.

రాజు—(తన్నుఁ జూచుకొని) నిజముగా నేనట్టి వాఁడనే యయినాఁడను. అవునుగదా ?

చ. ఉరవగు లోనితాపమున నుష్ణములై ప్రతిరాత్రియుఁ భుజో
పరిఁ గనుఁ గేవలం దొరఁగుబాష్పములన్ మణికాంతి మాయుబం
గరుకడియంబు జ్యాలతికకాయల నించుక నిల్చి జాఱఁగా
మరి మనికట్టునుండి పలుమాఱును బైకెగఁద్రోయనయ్యెడున్.

ప్రియం—(ఆలోచించి) చెలీ ! శకుంతల నాతని కొక మదన లేఖ వ్రాయనిమ్ము. పూవులలోఁ బెట్టి దేవతాప్రసాదమను మిష చేత నాతని చేతిలో నుంచెదను.

అన—అనాయాసకరమైన యీ యుపాయము నా కెంతో యనుకూలముగా నున్నది. శకుంతల యేమనునో !

శకుం—మీ యాజ్ఞ కన్యవిధముగాఁ జేయఁగలుగుదునా ?

ప్రియం—అట్లయిన మృదుపదములతో నొక పద్యమును రచించుట కాలోచింపుము.

శకుం—చెలియా ! ఆలోచించెదను గాని, అతఁ డాదరింపఁ డేమోయని నా హృదయము కంప మొందుచున్నది.

రాజు—ఓసీ పిరికిదానా!

ఉ. ఎవ్వఁడు నిన్ను నాదరణ మింక నొనర్చునో యంచు నెంచె దో
జవ్వని! యాతఁ డిప్పు సరస న్నిను గోరుచు నున్నవాఁ డిటన్;
క్రొవ్వున నెవ్వఁడైన సిరిఁ గోరిన వచ్చును రాకపోవుఁ; దా
నెవ్వని లక్ష్మి వేఁడు నతఁడీకొనకుండు నె యెన్నఁడేనియున్?

ప్రియం—ఓసీ! నీ సౌందర్యము నవమానించుకొనుచున్నావు! శరీరతాపమును జల్లపఱిచెడు శరత్కాలపు వెన్నెల నెవ్వఁడు బట్టచాటు పెట్టుకొని వారింపఁ జూచును?

శకుం—(చిఱునవ్వుతో) ఇప్పుడు మీ యాజ్ఞకు బద్ధురాలనయ్యెదను. (అని కూర్చుండి యాలోచించుచున్నది.)

రాజు—ఇది మంచిసమయము. కన్నుల ఱెప్ప వేయక యిప్పుడు ప్రియురాలిని జూచెదను. ఇదిగో,

గీ. పద్యము రచించుచున్న యాపద్మనయన
బొమలు పైకెత్తి చింతించు ముద్దుమొగము
పులకితము లైనయట్టి కపోలములను
దెలుపుచున్నది నామీఁదఁ గలుగువలపు.

శకుం—సఖీ! నే నొకగీతము నాలోచించితిని. వ్రాయుటకుఁ దగిన సాధనములు దాపున నేమియు లేవు.

ప్రియం—ఇదిగో చిలుకపొట్టవలె మృదువుగానున్న యీతామరాకుమీఁద గోళ్ళతో నక్షరములను వ్రాయుము.

శకుం—(చెప్పిన ప్రకారము చేసి) చెలులారా! దీని యర్థము చక్కఁగా పొసఁగియున్నదో లేదో వినుఁడి.

సఖు—అవహితల మయి యున్నాము.

శకుం—(చదువుచున్నది.)

గీ. నీదుహృదయంబు లేశంబు నే నెఱుంగ,
కాయజుఁడు నిర్దయుం డయి రేయిఁ బగలు
నకట! నీపొందు కోరు నా యంగకముల
నొకటఁ దపింపఁజేయుచు నున్నవాఁడు.

రాజు—(చటుక్కునఁ జెంతఁజేరి)

గీ. ఉవిద! మరుఁడు నిను దపియింపుచున్నవాఁడు;
కాని, సరిగ నను దహియింపఁగానె చొచ్చె;
దివస మల్లశశాంకు బాధించునంత
తీక్ష్ణముగఁ గుముద్వతిని బాధించు నెట్లు?

సఖులు—(చూచి హర్షముతో లేచి) అతిశీఘ్రలబ్ధ మనోరథుఁడవైన నీకు స్వాగతము.

శకుం—(లేవఁబోవుచున్నది)

రాజు—ఆయాస మక్కఱలేదు.

గీ. విరులశయ్యను బొరలిరు, వేగముగను
వాడు బిసఖండములు తావితోడఁ దగియు,
ప్రబలపరితాపభరమునఁ గ్రాఁగునీదు
తనుతరాంగము లుపచారవమునకుఁ దగవు.

అన—దేవర వా రిక్కడ శిలాతలమున దయచేయవలెను.

రాజు—(కూరుచున్నాఁడు)

శకుం—(లజ్జకలదియై యున్నది)

ప్రియం—మీ యిరువురకుంగల యన్యోన్యానురాగము ప్రత్యక్షమె. అయినను సఖీస్నేహము నన్నుఁ జెప్పినదానినే మరలఁ జెప్పునట్లు పురికొల్పుచున్నది.

రాజు—కళ్యాణీ! దాఁచవలదు. చెప్ప నిష్టము గలదానిని జెప్పకుండుట పరితాపమును బుట్టించును.

ప్రియం.—రాజు తన దేశములోని యాపన్నులయిన వారి దుఃఖోపశమనము చేయవలయును; ఇది మీ ధర్మముకదా ?

రాజు—అంతకంటె నుత్కృష్టధర్మము లేదు.

ప్రియం—అట్లయిన మా ప్రియసఖి నిన్ను గుఱించి కామదేవునిచే నిటువంటియవస్థ పొందింపబడినది. కాఁబట్టి, యనుగ్రహించి దీనిబ్రతుకు నిలుపఁదగును.

రాజు—ఓ శుభాంగీ ! ఈ ప్రార్థన మా యిరువురకును సామాన్యము. సర్వవిధముల నా కిది యనుగ్రహము.

శకుం—(ప్రియంవదనుజూచి) చెలీ ! అంతఃపురవధూవిరహముచేత సంతాపించుచున్న రాజశ్రేష్ఠుని నీ వేల నిర్బంధించెదవు ?

రాజు—గీ. నాదుహృదయస్థురాలవై నాతి ! నీవు
నను ననన్యపరాయణు ననృగతిని
దలఁచి తేనియు, స్మరబాణతతులఁ గొట్టఁ
బడియు నీవాక్యహతిఁ గొట్టబడుదు మరల.

అన—మిత్రుఁడా ! రాజులు బహు కాంతాప్రియులని విను చుందుము. కాఁబట్టి మా ప్రియసఖిని బంధుజనులకు దుఃఖము కలుగ కుండునట్లుగా నాదరింపుము.

రాజు—కళ్యాణీ ! పెక్కుమాట లేల ?

క. బహుకాంత లయిన మత్కుల
మహాప్రతిష్ఠాకరములు మఱిరెండె యగుఁ
రహిని సముద్రరశన యగు
మహియును, మీ నెచ్చెలి యగు మహిళామణియుఁ.

సఖు—మేము సంతుష్టి పొందినారము.

ప్రియం—(దృష్టి సారించి) అనసూయా ! ఇదిగో ! ఈ వంక

దృష్టి నిగిడించుచు వేడుకతో లేడిపిల్ల తల్లి నేలాగున వెదకుచున్నదో చూడుము. దానిని తల్లితోఁ గూర్తము రమ్ము.

(అని యిద్దఱును వెళ్ళఁబోవుచున్నారు)

శకుం.—సఖులారా! నే ననహాయురాల నగుదును. మీలో నొకరు నా యొద్దకు రండు.

సఖు.—భూమికంతకు రక్షకుఁ డయినవాఁడే నీ చెంత సహాయుఁడుగా నున్నాఁడు. (అని వెళ్ళుచున్నారు)

శకుం.—హా! సఖు లెట్లు వెడలిపోయిరి!

రాజు.—నీకు సంభ్రమ మెందుకు? ఈ సేవకజనుడు నీ సమీపముననే యున్నవాఁడు.

ఉ. చల్లనివై శ్రమం బడఁపఁజాలిన తామరపాకు వీవనల్
మెల్లనఁ గొంచు వీచుదునో మిక్కిలి శీతలమైన వాయువున్?
నల్లలితారుణాబ్జసదృశం బగు నీ చరణద్వయంబు నో
పల్లవపాణి! నా తొడలపై నిడి హాయిగఁ బట్టువాఁడనో?

శకుం.—మాననీయు లయినవారియెడ నపరాధము చేయఁ జాలను. (అని లేచి వెళ్ళఁబోవుచున్నది.

రాజు.—సుందరీ! ఇప్పు డెండ చల్లారలేదు. నీ శరీరస్థితియు నీలాగున నున్నది.

క. నలినీదళకల్పితమై
వెలయు కుచావరణ మున్న విరిపానుపు ని
మ్ముల విడిచి యెండలో నెట
కలఘుకృశాంగములతోడ నరిగెద వబలా?

(అని బలవంతముగా నామెను మరల్చుచున్నాఁడు.)

శకుం.—పౌరవా! సౌశీల్యమును గాపాడుము. మన్మథపీడితురాల నైనను నేను స్వతంత్రురాలనుగాను.

రాజు—బేలా ! గురుజనులవలనిభయము విడువు. ధర్మవేత్తయు బూజ్యుఁడు నగు కులపతి యిందునకయి నీయందు దప్పు పట్టఁడు. ఇంతియె కాదు.

గీ. పడఁతి ! రాజర్షి కన్యలు పలువు రిలను
వలచి గాంధర్వవిధిచేత వలయువారిఁ
బరిణయం బయి తముఁ గన్నవారిచేతఁ
బొగడఁబడి రని విన లేదె పూర్వమందు ?

శకుం—ఆర్యా ! ఇప్పుడు నన్ను విడువుము. మరల సఖీజనులఁ గని యనుమతంబు వడసి వచ్చెద.

రాజు—ఆలాగున నే విడిచెదను.

శకుం—ఎప్పుడు ?

రాజు—గీ. లలన ! యపరిక్షతముఁ గోమలంబు నైన
క్రొత్తపూ దేఁనె భృంగంబు క్రోలినట్లు
నీయనుగ్రహమునఁ జేసి నే నొకింత
తవిలి నీయధరసుధను నే ద్రావుపిదప.

(అని యామెముఖము నెత్తఁబోవుచున్నాఁడు)

శకుం—(నాట్యముచే మోము త్రిప్పుకొనుచున్నది.)

[తెరమఱుఁగున.]

ఓ చక్రవాక కాంతా ! నీ సహచరుని వీడ్కొనుము. రాత్రి సమీపించుచున్నది.

శకుం—(ఆలకించి తొట్రుపాటుతో) ఓ పౌరవా ! సందేహము లేదు. నా దేహస్థితిని దెలిసికొనుటకయి పూజ్యురాలయిన గౌతమి యిచ్చటికి వచ్చుచున్నది. ఆ కొమ్మలచాటున దాఁగి యుండుము.

రాజు—ఆలాగున నే. (అని దాఁగుకొనుచున్నాఁడు.)

[అంత, చేత పాత్రమును బట్టుకొని, గౌతమియు, సఖులును ప్రవేశించుచున్నారు.]

సఖు — అమ్మా! గౌతమీ! ఈలాగు. ఈలాగు.

గౌత — (శకుంతలవద్దకు వచ్చి) బిడ్డా! కాఁక నొందిన నీ దేహము చులుకనగా నున్నదా?

శకుం — అమ్మా! కాఁక నా కిప్పుడు విశేషముగా నున్నది.

గౌత — మంత్రించిన యీ దర్భోదకముచేత నీ శరీరము స్వస్థపడును. (అని శకుంతల శిరస్సుమీఁద జల్లి) ఓ బిడ్డా! ప్రొద్దువ్రాలుచున్నది. పర్ణశాలకు వెళ్ళుదము రమ్ము.

(అని లేచుచున్నారు.)

శకుం — (మనసులో) ఓ హృదయమా! మొదటనే యనాయాసముగా సంప్రాప్తమయిన మనోరథమునందును పిఱికితనమును విడువవైతివి. ఇప్పుడు మించె నని పశ్చాత్తాపపడుచున్న నీకు సంతాపమెట్లు పోవును? (మఱియొక యడుగు నడచి, ప్రకాశముగా) సంతాపమును బోఁగొట్టెడి యో తీవెగుంపా! మరలి వచ్చి ని న్ననుభవించుటకు సెలవు వేఁడెదను.

(అని దుఃఖముతో చెలులతోఁగూడ నిష్క్రమించినది.)

రాజు — (పూర్వస్థానమునకు వచ్చి నిట్టూర్పు విడిచి) ఆహా! అభీప్సితకార్యసిద్ధికి విఘ్నము లెన్నియైనను దటస్థించునుగదా!

గీ. మాటి కధరంబు వ్రేళ్ళతో మాటికొనుచు
నడ్డగింపుమాటలను విహ్వలతఁ జూపి
మూఁపువంక త్రిప్పిన కల్కి-ముద్దుమోము
లేవనెత్తియు ముద్దిడలేకపోతి!

నే నిప్పు డెక్కడకుఁ బోవుదును? ప్రియురా లనుభవించి విడిచిన లతావలయములుగల యిక్కడనే ముహూర్తమాత్ర ముండెదను. (అంతటను జూచి)

మ. ఇది యాశన్నియ మున్బరున్నశిలపై సింహాసందు పూశయ్య; యి
య్యది గోట న్నళినీదళంబుపయి వ్రాయంగన్నసల్లేఖ; య
ల్లది హస్తంబుననుండి జాఱిన బిసాలంకార; మీక్షించియుఁ
గదలంజాలను శూన్యవేతసలతాగారంబునం దుండియుఁ.

[కౌరమఱుఁగున]

ఓ రాజా!

శా. సాయంకాలమునంనుఁ జేయఁదగు భాస్వద్యజ్ఞ కర్మోత్కరం
బాయారీతుల సాగుచుండఁగను సంధ్యామేఘ చిత్రంబులై
యాయగ్నిప్రభ నొప్పు వేదికడ నత్యంతో గ్రరాత్రించర
చ్ఛాయల్ పెక్కుబహుప్రకారముల సంచారంబుగావించెదుఁ.

రాజు—ఇదె యిదె వచ్చుచున్నాఁడను.

(అందఱు నిష్క్రమించిరి.)

చతుర్థాంకము

రంగము—ఋషివనము

[అప్పుడు పూలుకోయుట నభినయించుచు అనసూయయు, ప్రియంవదయుఁ బ్రవేశించుచున్నారు]

అన—ఓసీ! ప్రియంవదా! మనశకుంతల గాంధర్వవివాహ విధిచేత తగినభర్తను బరిణయ మయినదని నా మనస్సునకు సంతోషముగానే యున్నదికాని యిది యొక్కటి యాలోచింపవలయును.

ప్రియం—ఏది?

అన—ఇప్పు డా రాజేంద్రుఁడు యజ్ఞముపరిసమాప్తి నొందించి ఋషులచేత వీడుకొల్పఁబడినవాఁడయి తన పురమును బ్రవేశించి యంతఃపురము చూచినతరువాత నిక్కడి వృత్తాంతమును తలపెట్టునో తలపెట్టఁడో!

ప్రియం—ఆ విషయమున దిగు లొందకుము. అటువంటి రూప విశేషముగా గుణాభావముగా నుండును. ఇఁక నేనుంటివేని, ఇప్పు డీ వృత్తాంతమునువిని, కణ్వమహాముని యేమి సెలవిచ్చునో తెలియదు.

అన—ఆయన యభిమత మొల్లుండునో నే నెఱుఁగుదును.

ప్రియం—ఎల్లు?

అన—మొదటినుండియు గుణవంతునకుఁ గన్య నీయవలయు ననియే యాయన సంకల్పము. అది దైవమే సమకూర్చినప్పుడు వా రనాయాసముగాఁ గృతార్థు లగుదురు.

ప్రియం—(పూలబుట్టనుచూచి) చెలియా! ఈ కోసినపూవులు దేవతాపూజకుఁ జాలునుగదా!

అన—మఱియు మనము ప్రియసఖియైన శకుంతలయొక్క సౌభాగ్యదేవతకుఁగూడ పూజ చేయవలెను.

ప్రియం—అవును. (అని మరల పూలు కోయుచున్నారు.)

[తెరమఱుఁగున]

ఓహో! ఇదిగో నేను వచ్చినాఁడను.

అన—(ఆలకించి) సఖీ! అతిథిమాటలాగున నున్నది!

ప్రియం—శకుంతల పర్ణశాలయొద్దనే యున్నది. (ఆలోచించి) కాని నేఁ డామె మనసుమాత్రము మఱియొకచోట నున్నది.

అన—అట్లయిన, పూవు లింతేచాలును. వెళ్ళుదమురమ్మా.

(అని యిద్దఱును నడిచిరి.)

[మరల తెరమఱుఁగున]

ఓసీ! అతిథిని బరాభవించితివి!

గీ. ఎవనినో తదేకచింతతో నెంచుకొనుచు
నెదుటనున్న తపోధను నెఱుఁగవు నను;
మగుడఁ దెల్పిన నతఁడు నిన్ మఱచుగాక
మత్తుఁ డెద వెనుకపనిమాట మఱచునట్లు.

ప్రియం—అయ్యో! అప్రియమే సంభవించినది! పరధ్యానము చేత శకుంతల పూజార్హులైన యెవ్వరియెడలనో యపరాధము చేసినది. (ముందువంకఁజూచి) అదిగో యెక్కనసే కోపముండు దుర్వాస మహర్షి. అతఁ డీప్రకారముగా శపించి దుర్వారకోపముతో మహా వేగముగాఁ బోవుచున్నాఁడు. అగ్ని లేక దహించుటకు మఱియెవ్వఁడు శక్తుఁ డగును?

అన—ప్రియంవదా! నీవు పోయి పాదములమీఁదఁ బడి యాతని మరలింపుము. ఇంతలో నే నర్ఘ్యోదకమును గొనివచ్చెదను.

ప్రియం—అలాగే. (అని నిష్క్రమించుచున్నది.)

అన—(ఒక యడుగు నడచి తొట్రుపాటుతో) అయ్యో! తొందరపడి నడుచుటచేత పుష్పపాత్ర జాఱి నాచేతిలోనుండి పడిపోయినది! (అని పూవులను ప్రోగుచేయుచున్నది.)

ప్రియం—(మరల వచ్చి) సఖీ! స్వాభావకుటిలుఁ డయిన యతఁ డెవ్వరిప్రార్థన నంగీకరించును? అయినను, అతని నెట్లో కొంత సదయునిగాఁ జేసి వచ్చితిని.

అన—(చిఱునవ్వుతో) అతనియెడ నదియుగొప్పయే. చెప్పు.

ప్రియం—ఎంతప్రార్థించినను మరలకున్నప్పుడు నే నిట్లు విన్నవించితిని—"దేవా! ఇది ప్రథమ మగుట విచారించి మీ తపః ప్రభావ మెఱుఁగని యీ బిడ్డయెడఁ గల యీ యొక్క యపరాధమును క్షమింపఁదగును."

అన—తరువాత, తరువాత.

ప్రియం—తరువాత నతఁడు—"నా వచన మన్యథా కాఁగూడదు. అయినను, ఆనవాలుగా నిచ్చిపోయిన యాభరణమును జూపఁగానే శాపవిముక్తి యగును."—అని పలికి తనంత నంతర్హితుఁ డయ్యెను.

అన—ఇప్పు డూఱడిలి యుండవచ్చును. ఆ రాజేంద్రుఁడు తాను వెళ్ళునప్పుడు స్మరణార్థమగునని తనపేరు చెక్కిన యుంగరమును స్వయముగానే శకుంతలచేతికిఁ బెట్టినవాఁడు. కాఁబట్టి, తగిన యుపాయము శకుంతల చేతిలోనే యున్నది. మన మింక దేవకార్యమును నిర్వర్తింతము రమ్ము. (అని నడుచుచున్నారు.)

ప్రియం—(చూచి) అనసూయా! ముఖ మెడమచేతిపై నుంచుకొని చిత్తరువు బొమ్మవలె మనప్రియసఖి యెట్లున్నదో చూడు. మగని మీఁది చింతచేతఁ దన్నుఁదానే యెఱుఁగ కున్నది. ఇఁక నతిథివిషయమునఁ జెప్పనేల?

అన—ప్రియంవదా! ఈ వృత్తాంతము మన యిద్దఱినోటనే యుండవలయును జుమీ. స్వభావమృదులయైన ప్రియసఖిని రక్షింపవలయునుగదా!

ప్రియం—నవమాలికను వేఁడినీళ్ళ నెవ్వఁడు తడుపును!

(యిద్దఱును నిష్క్రమించిరి.)

ఇది విష్కంభము.

రంగము—ఋష్యాశ్రమప్రాంతము.

[నిద్రనుండి లేచి కణ్వశిష్యుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

శిష్య—ప్రవాసమునుండి వచ్చిన పూజ్యుఁ డయిన కణ్వమహర్షి నన్ను వేళ చూచిరమ్మని పంపెను. బయల వెళ్ళి రాత్రి యెంతయవశిష్టమున్నదో చూచెదను. (అని కొంచెము నడచి చూచి) అయ్యో! తెల్లవాఱిపోయెను! అట్లేకదా!

చ. ఒకదెస నస్తశైలమున కోషధినాథుఁడు పోవుచున్నవాఁ;
డొకదెస భాస్కరుం డుదయమొందె ననూరుపురస్సరంబుగా;
నొకసమయంబునందె వ్యసనోదయముల్ గన రెండు తేజముల్,
ప్రకటసుఖంబు దుఃఖమును ప్రాణుల కిట్లని తెల్పుకై పడిన్.

మఱియును,

గీ. సోముఁ డంతర్హితుఁడు గాఁగ శోభ యెడలి
చూడఁదగు నల్లకుముదిని సొబగు తూలి;
వనితలకు నల్లభవియోగ జనితమైన
దుఃఖములె కావె యత్యంతదుస్సహములు!

13

అన—(ప్రవేశించి తెరమాటున) ఈ విధముగా విషయసుఖ మెఱుఁగని ఋషులకును దెలిసి యున్నప్పుడు, రాజు శకుంతలయెడఁ జేసినది గొప్ప యన్యాయమే.

శిష్యు—ఇప్పుడు హోమవేళ యయినదని గురువులకు నివేదించెదను. (అని వెళ్ళుచున్నాఁడు.)

అన—నాకిది తెలిసినను నే నేమిచేయఁగలను ? నా కేమి పని చేయుటకును గాళ్ళును చేతులు నాడకున్నవి. సత్యసంధుఁడు కాని యాతనియెడఁ దగులునట్లు చేసి మన చెలికత్తెను శూన్యహృదయనుగాఁ జేసెను గనుక మన్మథుఁ డింకఁ గృతార్థుఁ డౌనుగాక ! (ఆలోచించి) ఒకవేళ దుర్వాసునిశాపమే యతని కీమఱపును గలిగించుచున్న దేమో ? అట్లు గాకున్న, ఆ రాజేంద్రుఁడు, డటువంటిబాసలు చేసి యింతకాలము లేఖనైన నేల వ్రాయకుండును ? కాఁబట్టి, యీ యుంగరము గుఱుతుగా నాతని కంపవలెను. ఎప్పుడును దుఃఖముల పాలయ్యెడి యీ తాపసజనము నెవ్వఁడు మన్నించును? ప్రవాసమునుండి వచ్చినతండ్రియైన కణ్వునకు, శకుంతల దుష్యంతునికిఁ బరిణయమై గర్భవతియైన సంగతిని నివేదించుట కుత్సుకురాలనయినను, నా సఖియెడఁ దప్పుపట్టునేమోయని విన్నవింపఁ జాలకున్నాను. ఈ విధముగా మించినదానికి మన మేమిచేయఁగలము ?

ప్రియం—(ప్రవేశించి హర్షముతో) సఖీ ! శకుంతలయొక్క ప్రయాణోత్సవమును నడుపుటకయి త్వరగా రమ్ము.

అన—సఖీ ! అది యెట్లు !

ప్రియం—విను. నే నింతకుమునుపు సుఖముగా నిద్ర పట్టినదేమో యడుగుటకు శకుంతలయొద్దకు వెళ్ళితిని.

అన—తరువాత, తరువాత ?

ప్రియ—అప్పుడు సిగ్గుచేతఁ దలవంచుకొని యున్న యామెను గాఁగిలించుకొని కణ్వుఁడే స్వయముగా నిట్లు శ్లాఘించెను. "కన్నులఁ బొగ గ్రమ్ముకొని యున్నను భాగ్యవశముచేత సోమయాజిచేతి యాహుతి యగ్నిహోత్రములోనే పడినది. బిడ్డా! మంచిశిష్యున కిచ్చిన విద్యవలెనే నీవును నాకు సంతోషహేతువ వైతివి; ఇప్పుడే ఋషులను దోడిచ్చి నిన్ను నీ భర్తసన్నిధికిఁ బంపెదను."

అన—తండ్రియైన కాశ్యపున కీ వృత్తాంత మెవ్వరు చెప్పిరి!

ప్రియ—అగ్నిహోత్రగృహమునఁ బ్రవేశించినప్పు డాతనికి ఛందోబద్ధ మయిన యొక్క యశరీరవాక్కు చెప్పినది.

అన—(విస్మయముతో) అది యేదో చెప్పు.

ప్రియం—(దేవభాషతో)

గీ. దహనమును జమ్మికొమ్మలోఁ దాల్చినట్లు,
భూతలసమృద్ధి కొఱకు నీ పుత్రికయును
దనదుకడుపున దుష్యంతదత్తతేజ
మును ధరించి యున్నది సుమ్ము, భూసురేంద్ర!

అన—(ప్రియంవదను గాఁగిలించుకొని) సఖీ! నాకు సంతోషముగా నున్నది. బహుసంతోషముగా నున్నది. కాని యిప్పుడే శకుంతల యత్తింటికిఁ బంపఁబడుచున్నదగుటచే నా సంతోషము కొంత చింతతోఁగూడిన దైనది.

ప్రియం—సఖీ! మనచింత కేమి? ఆమెను వినోదింపఁజేయుదము; అందువలన మన శకుంతల సుఖపడనీ.

అన—చెలీ! అట్లయినఁ నే నీ మామిడికొమ్మం దగిలించిన కొబ్బరియాకులబుట్టలోఁ జిరకాలమునుండి యామెనిమిత్తమే దాఁచి యుంచిన పొగడపూలదండను నీవు పట్టుకొని గమ్ము. నేనింతలో

నా మెకు గోరోజనముతోను, తీర్థమృత్తికతోను, చెలుకు చిగుళ్ళతోను మంగళార్థముగు మైపూఁతను జేసెదను.

ప్రియం—అలాగే చేయుము. (అనసూయ వెళ్ళఁగాఁ ప్రియంవద పూలదండను గైకొనుచున్నది.)

[తెరచాటున]

గౌతమీ! శార్ఙ్గరవశారద్వతులను శకుంతలను దీసికొనిపోవుటకై నియమింపుము.

ప్రియం—అనసూయా! వేగిరము రమ్ము. ఇదిగో హస్తినాపురమునకు వెళ్ళెడు ఋషులు సందడించుచున్నారు.

అన—(ప్రవేశించి చేయి పట్టుకొని) సఖీ! పోదమురమ్ము.

(అని నడుచుచున్నారు.)

ప్రియం—(చూచి) ఇదిగో! సూర్యోదయవేళకే తలయంటుకొని, నీవారాక్షతలను జేతఁబట్టుకొని యాశీర్వదించెడి ఋషిభార్యలచే శ్లాఘింపఁబడుచు, శకుంతల యిక్కడనేయున్నది. ఈమెయొద్దకు వెళ్ళుదము. (అని సమీపమునకు వెళ్ళుచున్నారు.)

[అప్పుడు పయిన చెప్పిన పరివారముతో శకుంతల ప్రవేశించుచున్నది.]

మొదటిఋషిపత్ని—(శకుంతలతో) బిడ్డా! భర్త యొక్క బహుమానసూచకముగా "పట్టపుదేవి" నామము పొందుమా.

రెండవది—బిడ్డా! వీరమాతవు గమ్ము.

మూడవది—చిన్నదానా! మగనిమన్ననను బొందుము.

(అని దీవించి గౌతమి తప్ప తక్కినవారు నిష్క్రమించిరి.)

సఖులు—(దగ్గఱగా వెళ్ళి) సఖీ! మంగళస్నానము చేసితివా?

శకుం—నా సఖులారా! రండి. ఇక్కడ గూర్చుండుఁడు.

సఖు—(మంగళపాత్రమును బుచ్చుకొని కూరుచుండి) సఖీ! సరిగా నుండుము. మేము నీకు మంగళప్రదమయిన యలంకారమును జేసెదము.

శకుం—ఇది నాకు మిక్కిలి యాదరణీయము. ఇఁక నాకు సఖుల చేతి యలంకారము దుర్లభముగదా!

(అని కన్నీరు విడుచుచున్నది.)

సఖు—సఖీ! ఇట్లు శుభసమయమునం దేడుచుట నీకుఁ దగదు. (అని కన్నీరు తుడుచుచు నలంకరించుచున్నారు.)

ప్రియం—అయ్యో! ఆభరణార్హమయిన నీ రూపమున కాశ్రమమున లభించెడి యీ యలంకారములు వికారములుగా నున్నవి.

ఋషికుమారులు—(కానుకలు పట్టుకొని ప్రవేశించి) ఇవిగో నగలు; ఈమె కలంకరింపవలయును. (అందఱును చూచి యాశ్చర్య పడుచున్నారు.)

గౌత—వత్సా! హారీతా! ఇవి యెక్కడివి?

ప్రథముఁడు—గురువు లయిన కణ్వుల ప్రభావంబువలనఁ గలిగినవి.

గౌత—ఏమి? ఆయన మనస్సంకల్పమువలనఁ గలిగినవా?

ద్వితీయుఁడు—కాదు వినుము. శకుంతల నిమిత్తమయి వన స్పతులనుండి పుష్పములు తెండని పూజ్యుఁడైన కణ్వమహర్షి మా కాజ్ఞ యిచ్చెను. అందువలన నిప్పుడు—

చ. తను వొకటిచ్చెఁ జంద్రవిశదం బగు మేలిమి పట్టువస్త్రముల్,
జరణ మలంకరింప నిడెఁ జక్కనిలత్తుక నొక్కవృక్ష, మా
భరణము లిచ్చెఁ గొన్ని మణిబంధముదాఁకను పైకి నెత్తి త
త్తరుల చిగుళ్ళ నవ్వు వనదైవతపాణిపయోరుహంబులన్.

ప్రియం—(శకుంతలనుజూచి) చెలియా! ఈ వనదేవతా ప్రసాదము నీవు భర్తృగృహమునం దనుభవింపఁదగిన రాజ్యలక్ష్మికి సూచకముగా నున్నది.

శకుం—(లజ్జ నభినయించుచున్నది.)

ప్రథముఁడు—గౌతమా! రమ్ము రమ్ము. స్నానము చేసి వచ్చిన కణ్వమహర్షికి వనస్పతులసేవను నివేదింతము.

ద్వితీయుఁడు—అలాగుననే.

(అని యిద్దఱును నిష్క్రమించుచున్నారు.)

ప్రియం—సఖీ! మే మెప్పుడును భూషణముల నుపయోగించినవారము కాము. అయినను జిత్తరువును వ్రాయ నేర్చియుండుటచేత నీ యంగముల కాభరణముల నలంకరించుచున్నాము.

శకుం—మీ నేర్పు నే నెఱుఁగుదును.

(అప్పు డిద్దఱును నగలు పెట్టుచున్నారు.)

[అప్పుడు స్నానముచేసి వచ్చి కణ్వుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

కణ్వు—

ఉ. కొందలమందె డెందము శకుంతల తా నిపు డేగు నం చయో!
క్రందుగ బాష్పరోధమున గంఠమునుంజెడె; దృష్టి మాంద్యముం
బొందె; నొకింత పెంచిన తపోధనులే యిటు కుంద, నెంతగాఁ
గుందుదురో తమంతఁగను కూఁతులఁబాయు గృహస్థు లక్కటా!

(అని తిరుగుచున్నాఁడు.)

సఖు—సఖీ! శకుంతలా! నీ కిప్పు డలంకార మయినది. ఇఁక నీ వీ వెలిపట్టుచీరను గట్టుకొమ్ము.

శకుం—(లేచి కట్టుకొనుచున్నది.)

గౌత—బిడ్డా! ఇదిగో నీ తండ్రి యానందరసము వెల్లిగొలుపు కన్నులతోఁ గౌఁగిలించుకొనువానివలె వచ్చుచున్నాఁడు. ఇప్పుడు గౌరవంబు సడుపుము.

శకుం—(సిగ్గుతో) అయ్యా! నమస్కరించుచున్నాను.

కణ్వుఁడు—కుమారీ!

క. అల శర్మిష్ఠ యయాతికి
వలెఁ బ్రేమాస్పదము గమ్ము వరునకు నీవుఁ;
జెలువరో! యాసతి పూరుప
పొలుపున, సామ్రాజ్య మేలుపుత్రునిఁ గనుమా.

గౌత—దేవా! ఆశీర్వచనములు కావు. ఈ రెండును బిడ్డకు వరములే.

కణ్వ—కుమారీ! ఇక్కడ నిప్పుడే హోమము చేసిన యీ యగ్నిహోత్రునకుం బ్రదక్షిణంబు చేయుము.

శకుం—(అట్లు చేయుచున్నది.)

కణ్వ—(ఋక్ఛందస్సుచేత నాశీర్వదించుచున్నాఁడు.]

గీ. వేదియంతటఁ సమిధలు వెలుఁగుచుండఁ,
బ్రక్కలను దర్భనిచయంబు పఱుపఁబడుచు,
హవ్యగంధంబునఁ గలుష మడఁచు నట్టి
సిద్ధయాగాగ్ని నిను శుద్ధఁ జేయుఁగాత!

ఇప్పుడు బయలుదేఱుము. (దృష్టినిగిడించి) ఏరీ! ఆ శార్ఙ్గరవ శారద్వతులు!

శిష్యులు—(ప్రవేశించి) దేవా! ఇదిగో వచ్చినారము.

కణ్వ—శార్ఙ్గరవా! నీ చెల్లెలికి దారి చూపుము.

శార్‌ఙ్గ—అమ్మా! ఈలాగు ఈలాగు.

(అని యందఱు నడచుచున్నారు.)

కణ్వు—సన్నిహితము లయియున్న యో తపోవనవృక్షము లారా!

చ. ఎవతె జలంబు మీకిడక యెన్నఁడుఁ ద్రాగదు తానుముందుగా;
నెవరితె ప్రేమచేఁ జిదుమ దీప్సితభూషణ యయ్యు మీ చిగు;
ళ్ళెవతెకు మీరు తొల్త ననలెత్తుట పండువుగాఁగ నుండు నా
ప్రవిమలగాత్రి యేఁగుఁ బతిపజ్జకు నంద అనుజ్ఞ యీయరే.

(కోకిలకూఁత విని)

గీ. ఈ విధమ్మునఁ బికమృదురావమునను
ప్రతివచన మిచ్చెఁ గావున, వననివాస
బంధువర్గంబు లయియున్న వసుమతీ రు
హంబులు శకుంతల ప్రయాణ మనుమతించె.

[ఆకాశమునందు]

గీ. ఎడ నడను దమ్మికొలఁకుల నింపుమీఱి,
తనులనీడలచే నెండ తగులకుండి,
యంబుజపరాగమున మెత్తనగుచు, సతికిఁ
బథము శుభ మిచ్చు ననుకూలవాయువులను.

[అందఱును విస్మయముతో నాలకించుచున్నారు.]

గౌత—బిడ్డా! బంధువులయెడ స్నేహముఁగల యీ వనదేవతలు వెళ్ళుటకు నీ కనుజ్ఞ యిచ్చినవి. ఈ దేవతలకు మ్రొక్కుము.

శకుం—(నమస్కార పూర్వకముగా నడచి రహస్యముగా) సఖీ! ప్రియంవదా! భర్తను దర్శించుటకయి వేడ్క కలిగియున్నను ఆశ్రమమును విడువవలెనను దుఃఖముచేత నాపాదములు ముందు సాగకున్నవి.

ప్రియం—తపోవనమును విడువలేక సంచలించుచున్నది నీ వొక్కతవే కావు. నీచేత విడువఁ బడనున్న యీ తపోవనము యొక్కయు నవస్థను జూడు,

గీ. మృగతతులు దర్భకబళంబు మ్రింగకుండె;
నెమలిగుంపులు తమ నర్తనములు మానె;
పండుటాకులు రాల్చుచు భవ్యలతలు
బాష్పకణములు విడిచెడుపగిది నుండె.

శకుం—(స్మరణకుఁ దెచ్చుకొని) తండ్రీ! నా సహోదరియగు మాధవీలత నిప్పుడు సెలవడిగి వచ్చెదను.

కణ్వ—బిడ్డా! నీకు దానియెడఁగల సోదరీస్నేహము నే నెఱుఁగుదును. అది యిదిగో దక్షిణమున నున్నది.

శకుం—(లతను జేరి కౌఁగిలించుకొని) లతాసహోదరీ! నీవు క్రొమ్మావితోఁ గూడియున్నను, ఇప్పుడు నీ శాఖాభుజంబులచేత నన్నాలింగనము చేసికొమ్ము. ఇది మొదలుకొని నేను నీకు దూరస్థురాల నగుదును—ఓ తండ్రీ! దీనిని నాకుమాఱుగాఁ జూచుకొమ్ము.

కణ్వ—శకుంతలా!

గీ. తొలుత నీవిషయము నేను దలఁచినట్లు
పుణ్యమున నీకుఁదగుభర్తఁ బొందితీవు;
మావిఁ జేపట్టె నెలమి నీమాధవియును,
గాన మీకయి యిఁకఁ జింతమాని యుందు.

ఇఁక దారిని నడువుము.

శకుం—ఇదిగో! నా లతాపుత్రిక యైన 'వనజ్యోత్స్న' తో గూడఁ జెప్పి వచ్చెదను. (లతను డాసి ముద్దు పెట్టుకొని) ఓ బిడ్డా! ఇన్నాళ్ళు పెంచి నిన్ను దిగవిడిచి పోవుచున్నా నని వాడిపోకు, మా తండ్రిగారు నిన్ను నామాఱుగాఁ జూచుకొందురు. నన్నుఁ బంపుము. (చెలికత్తెలతో) చెలులారా! దీనిని మీయిద్దఱికి నప్పగించెదను.

సఖు—మాయిద్దఱ నెవ్వరి కొప్పగించి పోయెదవు?

(అని కన్నీరు విడుచుచున్నారు)

కణ్వు—అనసూయా! ఏడువవలదు. మీరే కదా శకుంతలకు ధైర్యము చెప్పవలసినవారు.

(అందఱును నడచుచున్నారు)

శకుం—నాయనా! ఇదిగో పర్ణశాలసమీపమునఁ దిరుగుచుఁ గడుపుతో నుండుటచేత మెల్లగా నడచుచున్న యీలేడి యెప్పుడు సుఖప్రసవ మగునో యప్పుడే యా శుభవార్త దెలుపుటకయి యెవ్వరి నైనం బంపుము.

కణ్వు—నే నిది మఱచిపోను.

శకుం—(గమనప్రతిబంధము నటించి) ఎవ రిది? నా చీర పట్టుకొని నిలుపుచున్నారు! (అని వెనుక తిరుగుచున్నది)

కణ్వు—బిడ్డా!

గీ. కఱకుకుశ గ్రుచ్చుకొని నోరు గాయమైనఁ
బూయుచును గారనూనెను, బుండు మాన్పి,
ప్రేమచేఁ జామలను మేపి, బిడ్డనలెను
బెంచుటను దారిఁ బాయ దీ పిల్లలేడి.

శకుం—బిడ్డా! సహవాసులఁ బరిత్యజించి యేఁగెడు నన్నేల నెంబడించెదవు? పుట్టినతోడనే తల్లిచే విడువఁబడియుఁ బెరిఁగితివి. ఇప్పుడును నాచే విడువఁబడిన నిన్ను మానాయనగారే విచారింతురు. ఇఁక వెనుకకు మరలుము.

(అని యేడ్చుచు నడచుచున్నది)

కణ్వు—బిడ్డా! కన్నులు తుడుచుకొని తిన్నఁగా దారి చూచి నడువుము.

గీ. ఱెప్పలెత్తిన కన్నులఁ గప్పి, దృష్టి
జాడ్య మిడుబాష్పముల నిల్పు స్థైర్యమునను;

ద్వారిచూడక నడువఁ బదద్వయంబు
జాఱు నీ హెచ్చుతగ్గగు సరణియందు.

శార్ఙ్గ — దేవా! బంధుజను లుదకప్రదేశమువఱకే కూడరాఁ దగినవారని శాస్త్రము. ఇదిగో సరస్తీరము. ఇక్కడ మాతోఁ జెప్ప వలయు దానిని జెప్పి మీరు వెనుక మరలఁ దగును.

కణ్వ — అట్లయిన మన మీపాలచెట్టు నీడను నిలుతము.

(అందఱును నడచి నిలుచున్నారు)

కణ్వ — (తనలో) పూజ్యుఁడయిన దుష్యంతునకు మే మిప్పు డేమని సందేశము పంపిన యుక్తముగా నుండును?

(అని యాలోచించుచున్నాఁడు)

శకుం — (రహస్యముగా) సఖీ! చూడు. తామరాకుచాటున దాఁగిన ప్రియవల్లభుని గానక యాతురయై చక్రవాకాంగన కూయు చున్నది. ఇందుచే ముందుకార్యము దుష్కర మనుకొనియెదను.

అన — సఖీ! ఇట్లు తలంపకుము.

గీ. ధవునిఁ బాసియు నిది విషాదంబుచేతఁ
గరము దీర్ఘ మగు రాత్రిని గడపుచుండు;
విరహదుఃఖ మత్యంతదుర్భర మె యైన,
నోర్వఁజేయు నాశాబంధ మొనర దాని.

కణ్వ — శార్ఙ్గరవా! మీరు శకుంతలను ముందుంచుకొని రాజుతో నావచనములుగా నిట్లనవలయును.

శార్ఙ్గ — దేవర యానతీయవలయును.

కణ్వ — ఉ. మమ్మును సత్తపోధనుల, మాన్యభవత్కులముఁ, స్వబంధులన్
సమ్మతి వేఁడ కీసు యెటో సల్పిన నీపయికూర్మి నెంచి, మా
కొమ్మను నేలుకొమ్ము సరికొమ్మలతో సమగౌరవంబునన్;
బిమ్మటిదెల్ల భాగ్యమగుఁ; జేరొకనరాదది యింతిబంధువుల్.

కణ్వు—బాలా! నీకును మేమిప్పుడు బుద్ధులు చెప్పవలయును. మేము వనవాసుల మయ్యును లౌకికజ్ఞానము కలవారమే సుమీ.

శార్ఙ్గ—ధీమంతులకుఁ దెలియనివిషయమేది యుండును?

కణ్వు—పుత్రీ! నీ విక్కడినుండి పతిగృహమును బ్రవేశించి

చ. గురులకు సేవఁజేయు మనుఁగుంగతి జూడుము నీసపత్నులన్;
వరుఁ డలుక న్వహించినను భర్తృవిరుద్ధవు గాకు మీసునన్;
బరిజనులందుఁ జూపుము కృపంగడుఁ; బొందకు భాగ్యగర్వమున్;
తిరిగిన నిట్లు, కాంతుకు సతీత్వముకాంతలు; నింద్యలొందుచోన్.

గౌతమి యిది యేవిధముగా నెంచునో!

గౌత—వధూజనుల కుపదేశింపవలసిన దింతే, బిడ్డా! ఇది యంతయు మనసున నాటించుకొమ్ము.

కణ్వు—బిడ్డా! నన్నును నీ సఖిజనమును కౌఁగిలించుకొమ్ము.

శకుం—అయ్యా! ఏమి! ప్రియంవదయు, ననసూయయుఁగూడ నిక్కడనుండియే మరలెదరా?

కణ్వు—బిడ్డా! వీరు నొకరి కియ్యఁదగినవారే. కాఁబట్టి, వీరు నీతోఁగూడ రాఁగూడదు; నీతోఁగూడ గౌతమి వచ్చును.

శకుం—(తండ్రిని కౌఁగిలించుకొని) మలయపర్వతము నుండి పెల్లగింపఁబడిన చందనలతవలెనే యిప్పుడు తండ్రి యుత్సంగమును విడిచి యన్యదేశమునందు నే నెట్లు ప్రాణములు నిలుపఁగలను? (అని యేడ్చుచున్నది.)

కణ్వు—బిడ్డా? ఏమి యిట్లు భయపడుచున్నావు?

చ. గరిమ మహాకులీనుఁ డగు కాంతునిపట్టపుదేవి వౌచు, ను
ర్వరఘునకార్యవైభవము పైఁబడి యుండి ప్రతిక్షణంబు, భా
స్కరు నల పూర్వదిక్కువలెఁగాంచి పవిత్రుసుఁ బుత్రు వేగ, మ
ద్విరహాభవాతిదుఃఖమును బిడ్డ గణింపవు నీవు లేశమున్.

(శకుంతల తండ్రి పాదములకు మ్రొక్కుచున్నది.)

కణ్వు—వాంఛితార్థసిద్ధి యగుఁగాక!

శకుం—(సఖులవంకఁ దిరిగి) చెలులారా! మీ రిద్దఱును నన్నొక్కసారి కౌఁగిలించుకొనుఁడు.

సఖు—(అట్లు చేసి) చెలీ! ఆరాజొకవేళ నిన్ను గుఱుతుపట్ట లేక పోయినపక్షమున, నీవప్పు డతని కాతనిపేరు చెక్కిన యీ యుంగరమును గనఁబఱుపుము.

శకుం—మీ యీ సందేహముచేత నా దేహము కంపమొందుచున్నది.

సఖు—చెలీ! భయపడకు. అతి స్నేహ మెప్పుడును గీడును శంకించుచుండును.

శార్ఙ్గ—అమ్మా! ఎండ యెక్కుచున్నది. నీవు త్వరపడవలెను.

శకుం—(ఆశ్రమమువంక తిరిగి నిలుచుండి) నాయనా! నేను తిరిగి యెప్పు డీ తపోవనమును జూతునో కదా?

కణ్వు—బిడ్డా! వినుము.

గీ. సకలమహికిని జిరముగ సవతి వగుచు,
నవని నప్రతిరథుని దౌష్యంతి నిలిపి,
పట్టికిఁ గుటుంబభర మిచ్చి భర్తఁ గూడి
శాంతవై చొత్తు వి వ్వరాశ్రమము మరల.

గౌత—బిడ్డా! ప్రయాణవేళ మించిపోవుచున్నది. తండ్రినిఁక వెనుకకుఁ బంపుము. (కణ్వునిఁ జూచి) ఈమె యెంత తడవైనను మరల మరల మీతో నీలాగునఁ జెప్పుచునే యుండును. మీరు వెనుక మరలవలెను.

కణ్వు—మా తపోనుష్ఠానమునకు భంగము కలుగుచున్నది. కాఁబట్టి, యిఁక మరల గోరెదను.

శకుం—(మరల తండ్రి నాలింగనము చేసికొని) నాయనా! తపశ్చరణముచేతఁ జిక్కిపోయిన యీ దేహమును నా నిమిత్తమయి మిక్కిలి కృశింపనీకుము.

కణ్వ—(నిట్టూర్పు విడిచి)

గీ. పర్ణశాలకు వాకిట బలికిఁగాను
దల్లి! నీ విడ్డనివ్వరిధాన్య మదరి
కలయ మొలచిన మొలకలు గనఁగ, నాకు
వితతశోకోపశమన మేగతిని గలుగు?

నడువు. నీకు మార్గమున మే లగుఁ గాక!

(అన, శకుంతలయు సహచరులును నిష్క్రమించిరి.)

సఖు—(శకుంతల పోయినవంక తడవు చూచి) కటకటా! శకుంతల వనవీధిలోఁ గనుచాటయినది.

కణ్వ—(నిట్టూర్పువిడిచి) అనసూయా! ప్రియంవదా! మీ చెలి కత్తె దాఁటిపోయినది. దుఃఖమడఁచుకొని మీరిటు నాతోఁగూడ రండు.

సఖు—తండ్రీ! శకుంతల లేని యీ తపోవనము పాడుపడినట్టు న్నది. మే మెట్లు చొత్తుము?

కణ్వ—స్నేహవృత్తిచేత మీ కాలాగుసఁ గనఁబడుచున్నది. (విచారముతో నడచి) ఆహా! ఓబిడ్డలారా! శకుంతలను మగనియింటికిఁ బంపివేసి యిప్పుడు స్వస్థతను బొందినాఁడను.

గీ. కన్య యెప్పుడుఁ బరుని సొత్తైకాన, దాని
నిప్పుడు ప్రతిగృహీతకు నప్పగించి,
దాపుడుధనంబు స్వామికిఁ దార్చినట్టు
లెంతొ నిర్మల మయ్యె నాయంతరాత్మ.

(అని అందఱును నిష్క్రమించుచున్నారు)

పంచమాంకము

రంగము—రాజమందిరము

[అప్పుడు సింహాసనాసీనుఁడయి రాజును, విదూషకుఁడును ప్రవేశించుచున్నారు]

విదూ—(చెవి యిచ్చి) ఓ మిత్రుఁడా! సంగీతశాలలోపల లక్ష్యముంచుము. మృదుమధురమైన తేటపాటలో స్వరసమ్మేళనము వినవచ్చుచున్నది. దేవియైన హంసపదిక వర్ణములు నేర్చుకొనుచున్నదని తలఁచెదను.

రాజు—మాధవ్యా? ఊరకుండు. నేను వినియెదను.

[తెరమఱుఁగున పాడఁబడుచున్నది]

ద్విపద. క్రొత్తపూదేనియఁ గ్రోలంగ నీవు
చిత్తంబునను గోరి స్వేచ్ఛగా నపుడు
క్రొమ్మావివిరి దేనె, గోర్కి తీఱంగ
నమ్మాడ్కి హాయిగా ననుభవించియును
నిపు డీవు మధుపమా! యింతలో నిచట
నపురూపమైన యీ యంబుజ సవతి
మరగి సుఖించెడుమాత్రాన యెట్లు
మఱవఁగల్గితి తొంటిమావిమంజరినె?

రాజు—అహాహా! ఈ పాట రాగప్రవాహిని యగుచున్నది.

విదూ—ఈ పాటలోని యక్షరార్థము తమకుఁ బూర్ణముగా దెలిసినదా యేమి?

రాజు—(చిఱునవ్వునవ్వి) ఈమె యొకప్పుడు నాచేతఁ బ్రేమింపబడినది. అందుచేత వసుమతీదేవి విషయమై యీమె నన్ను నిందించు

చున్న దనుకొనెదను. మిత్రుఁడా! మాధవ్యా! నన్ను నిపుణముగా నెత్తిపొడిచితి వని హంసపదికతో నా మాటలుగాఁ జెప్పుము.

విదూ—దేవర యాజ్ఞయిచ్చినట్లు చేసెదను. (లేచి) మిత్రుడా! అప్సరసచేతిలోఁ బడిన విరాగునివలె యీమె యితరులచే జుట్టుపట్టించి కొట్టించెడు నా కిఁక ముక్తియుండదు.

రాజు—పోయి నాగరికవృత్తితో నామెకుఁ దెలుపుము.

విదూ—ఏమి సంగతి ? (అని నిష్క్రమించెను.)

రాజు—(తనలో) అది యేమోకాని గీతార్థ మటు విని ప్రియ జనవియోగము లేకయు నే నేమియుఁ దోఁచనివాఁడనుగా నున్నాఁడను. అట్లు కాదు—

గీ. మున్నెఱుఁగకయు మది నంటు పూర్వజన్మ
భవ్యసఖ్యముల్ స్మరణకు వచ్చుఁ గాన,
జనుఁడు సుఖితుఁ డయ్యు సురూపచయముఁ గనియు
సుస్వరంబుల వినియు నుత్సుకతఁ గాంచు.

(అని వ్యాకులపాటుతో నుండుచున్నాఁడు.)

[అప్పుడు కంచుకి ప్రవేశించుచున్నాఁడు.]

కంచు—ఆహా! నేనిటువంటి యవస్థను బొందినాఁడనుగదా!

గీ. అవహితుఁడనై కులాచార మనుచు నేను
దాల్చు నీవేత్రయష్టి, యంతఃపురములఁ
గాల మధికంబు చెల్లినకతన నిపుడు
నడువలేని నా కవలంబనమున కయ్యె.

ఓయీ! రాజునకు ధర్మకార్యము మిక్కిలి యనతిక్రమణీయము. అట్లయినను, ఇప్పుడే ధర్మాసనమునుండి లేచిన యీయనకు మరల శ్రమ కలిగించు కణ్వశిష్యుల రాకను దెలుపుటకు మనసు

గోలుపకున్నది. అట్లు కాదు. ఈలోకతంత్రాధికారమున కెన్నఁడును విశ్రాంతిలేదు. ఎట్లన —

గీ. అరుణుఁ డొకఁడె మొగిని యశ్వంబులను గట్టు;
రేయిఁబగలుఁ దిరుగు వాయుదేవుఁ;
డవనిభరముఁ దాల్చు ననయంబు శేషుఁడు;
ధరణిపాలురకును ధర్మ మిదియ.

ఇఁకఁ గణ్వాని నియోగము నడపెదను. (అని నడిచి చూచి) ఈ రాజు —

గీ. నడపి గజయూథముల, నెండఁబడుచుఁ బగలు
శీతలస్థలి గజరాజు చేరునట్లు;
ప్రజలఁ దన కన్నబిడ్డలనలెను నడపి
స్వస్థచిత్తుఁడై నిర్జనస్థలముఁ జేరె.

(సమీపించి) దేవా! జయమగుఁగాక! జయమగుఁగాక! ఇదిగో వీరె హిమవంతప్రాంత వనవాసు లయిన తపస్వులు. కణ్వసందేశమును గొని స్త్రీలతోఁగూడ వచ్చియున్నారు. ఇక దేవర యిచ్చ వచ్చినట్లు చేయఁదగును.

రాజు—(ఆదరముతో) ఏమీ? కణ్వసందేశము తెచ్చినవారా?

కంచు—మఱియేమి!

రాజు—ఆశ్రమవాసు లయిన వీరలను శ్రౌతవిధిచేత సత్కరించి స్వయముగానే తాను వారి నెదుర్కొని తీసికొని రావలయునని పురోహితుఁ డయిన సోమరాతునితో నామాటలుగా విన్నవింపుము. నేనును దపస్విదర్శనమునకునుఁ దగినచోటనుండి వారికయి ప్రతీక్షించుచుండెదను.

కంచు—దేవర యాజ్ఞాపించునట్లు చేసెద.

(అని నిష్క్రమించుచున్నాఁడు.)

రాజు—(లేచి) వేత్రవతీ! అగ్నిహోత్రశాలకు దారిచూపుము.

ప్రతీహారిణి— దేవా! ఇటు, ఇటు.

రాజు—(నడచి, అధికారదుఃఖమును కనఁబఱచి) జనులందఱును గోరినవస్తువులను బొంది సుఖు లగుచున్నారు. రాజులకో కార్య సాఫల్య మయినను దుఃఖమే.

గీ. అగపడఁగనీదు చింత రాజ్యప్రతిష్ఠ;
రాజ్యపాలన మెంతయు శ్రమకరంబు;
దండమును జేతఁ దాల్చు ఛత్రంబువోలె,
రాజ్యమె శ్రమంబు నిచ్చుచు శ్రమము నడఁచు.

వైతాళికులు—(తెరలో) దేవా! విజయ మగుఁగాక!

ప్రథముఁడు—గీ. స్వసుఖమును జూడ కలసెదు జగముకొఱకుఁ;
ప్రతిదినంబును నీకు వ్యాపార మిదియె!
చెట్టు తీక్ష్ణాతపముఁ దాల్చి శిరసుచేతఁ,
దనదునీడచే నాశ్రితతాప మడఁచు.

ద్వితీయుఁడు— గీ. మరలిచెదు శిక్ష చేసి దుర్మార్గచరులఁ;
గలహము లడంతు; వారసి కాంతు వీవు;
బంధు లెంతటి యైశ్వర్యవంతు లున్న,
బంధుకృత్యంబు నెఱపెదు ప్రజల కీవె

రాజు—చింతాక్రాంత మనస్కుల మయి యున్నను మేలగు వచనములచేత నభినవసత్త్వసంపన్నుల మయితిమి!

(అని నడచుచున్నాఁడు)

ప్రతీహారి—క్రొత్తగాఁ దుడుచుటచేతఁ బ్రకాశించుచు సమీపమున హోమధేనువున్న యగ్నిహోత్రగృహముయొక్క వెలుపటిగుమ్మ మిదె దేవర యెక్కవలయును.

రాజు—(ఎక్కి, పరిజనుని మూఁపుమీఁద చేయూఁతచేసి నిలుచుండి) వేత్రవతీ! ఏమి యుద్దేశించి పూజ్యుఁడయిన కణ్వమహర్షి నా యొద్దకు ఋషులను బంపి యుండును?

చ. పరమ తపోనిరూఢ మునివర్య తపస్సులు విఘ్న మొందెనో!
యరయక యెవ్వరైన ఖలు లాశ్రమజంతుల కెగ్గు చేసిరో!
విరుల మదీయదోషమున వృక్ష లతావళు లియ్య మానెనో!
యెరయఁగలేక సంశయము నాకులపాటు మనంబు చెందెడున్.

ప్రతీ—తమ సుచరిత్రచేత సంతుష్టులయిన ఋషులు దేవరవారిని గొనియాడుటకయి వచ్చినారని నే నూహించెదను.

[అప్పుడు గౌతమీసహిత యైన శకుంతలను ముందిడుకొని
మునులును, వారిముందు కంచుకియు, పురోహితుఁడును
ప్రవేశించుచున్నారు]

కంచు—ఆర్యులారా! ఇటు, ఇటు.

శార్ ఙ్గ—శారద్వతా!

చ. ఇలను మెలంగు భాగ్యనిధి యీనృపుఁ, డేమియు మేరమీఱి కే
కులమున నెంతహీనుఁడును గుత్సితమార్గము పట్టఁ డొక్కఁడున్;
దలఁచెద నట్టు లయ్యు, విజనస్థలి మున్ను నతెంబు నుంటచేఁ,
బలు జనులున్న యీ గృహము వహ్నిపరీతగృహంబున బ్లైదన్.

శార్ ఙ్గ—పురప్రవేశము చేత నీ విట్లగుట యుక్తమే; నేనును-

ఉ. స్నాతుఁడు కల్మషాంగుఁ గనుచందమునన్, బటుదుష్టవర్తనున్
బూతచరిత్రుఁ డెంచుగతి, భూరివినిద్రితు మేలుకొన్నవాఁ
డాతతబుద్ధితోఁ దలఁచునట్లుగ, స్వేచ్ఛ మెలంగువాఁడు కా
రాతిలబద్ధునట్లుగఁ, దలంచెద నీయిహసౌఖ్యచిత్తులన్.

శకుం—(నిమిత్తమును సూచించి) అయ్యో! ఏమోకాని నా కుడికన్ను దరుచుచున్నది.

గౌత—బిడ్డా! నీకీయశుభము తొలంగునుగాక! నీభర్త కులదేవతలు నీకు శుభము లిత్తురుగాక ! (అని నడచుచున్నది.)

పురో—(రాజును జూపి) ఓతపస్వులారా ! ఇదిగో వర్ణాశ్రమ పరిపాలనముచేయు మహారాజంతకుమునుపే సింహాసనము దిగి మీ నిమిత్తము నిరీక్షించుచున్నాఁడు. ఆయనను సందర్శింపుఁడు.

శార్ఙ్గ—ఓమహాబ్రాహ్మణా ! ఇది యెంతయుఁ గొనియాడఁదగినదే, మేమీ విషయమున మధ్యస్థులము.

గీ. తరులు ఫలసమృద్ధిని నమ్రతను వహించు;
మేఘములు నవోదకముల మిగుల వంగు;
సత్పురుషు లుద్ధతులు గారు సంపదలను;
బటుపరోపకారులకు స్వభావ మిదియె.

ప్రతీ—దేవా ! ఋషులు ప్రసన్నముఖవర్ణులయి కనఁబడుచున్నారు. అందుచేత వారు వచ్చినకార్యము విశ్వాసయుక్తమయినదని నే ననుకొనియెదను.

రాజు—(శకుంతలను జూచి)

గీ. పయిని మేలిముసుంగును వైచుకొనుచు,
మేనిచెలువంబు స్ఫుటముగాఁ గానఁబడక
పండుటాకులలోఁ బల్లవంబుపగిది
ఋషులనడుమ నుండినయీమె యెవతె కొయెక్కో ?

ప్రతీ—కుతూహలముగలదయి నాయూహ విన్నఁగా వ్యాపింపకున్నది. అయిన నీమెరూపము చూడఁదగినదిగాఁ గానఁబడుచున్నది.

రాజు—అవుఁగాక! పరకళత్రమును దేఱిచూడరాదు.

శకుం—(చేయి ఱొమ్మునఁజేర్చుకొని తనలో) హృదయమా ! ఏమి యిట్లు వడఁకుచున్నావు ! భర్తగారిభావము తెలిసికొన నించుక ధైర్యము వహింపుము.